
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

పల్నాడు జిల్లా వార్తలు

సోమవారం 4 నవంబరు 2024



పిడుగురాళ్లలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

మున్సిపాలిటీలలో తాగు నీటి పథకాలపై విస్తరణకు నీలినీడలు తొలగిపోనున్నాయి. ఐదేళ్ల పాటు వైసీపీ సర్కార్ నిలిపివేసిన పనులు పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిధుల లేమితో ఎక్కడిక్కడే పనులు నిలిచిపోయాయి. నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను వైసీపీ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకొని పథకాలకు మొండిచేయి చూపింది. ఫలితంగా ఐదేళ్లు తాగు నీటి సమస్యలు పరిష్కారం కాక పురాల పౌరులు ఇక్కట్లు పడుతున్నారు. నిలిచిపోయిన పథకాల పనులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం నడుం కట్టింది. ఆసియా మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ) నిధులతో పట్టణాల్లో నాడు తెలుగుదేశం ప్రభుత్వం రక్షిత మంచినీటి పథకాల విస్తరణ పనులు చేపట్టగా వీటిని పూర్తి చేయక వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది.

- ఆగిన పనులపై కూటమి ప్రభుత్వం దృష్టి
- ఏఐఐబీ నిధుల కేటాయింపు



తాగునీటి పథకాల విస్తరణకు నిధులు



వినుకొండలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు కార్పొరేషన్‌తో సహా మంగళగిరి, తాడేపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలలో తాగు నీటి పథకాల విస్తరణకు ఆసియా మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల బ్యాంకు (ఏఐబీ) నిధులు మంజూరు చేసింది. ఈ మునిసిపాల్టీలో ఉన్న నీటి పథకాలను పూర్తి స్థాయిలో రానున్న 25 ఏళ్లలో పెరగనున్న జనాభాను అంచనా వేసి ఇందుకు అనుగుణంగా అధునీకీకరణ పనులు చేపట్టారు. గత ఐదేళ్ల ఎక్కడి పనులు అక్కడనే ఉన్నాయి. సదరు బ్యాంకు రుణం 70 శాతం, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాధనంగా కేంద్ర ప్రభుత్వం ఒప్పందం చేసింది. బ్యాంకు నుంచి విడుదలైన నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు జమ అయ్యాయి. ఈ నిధులు విడుదలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం వాటా ధనం కూడా విడుదల చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ధనం ఇవ్వకపోగా బ్యాంకు విడుదల చేసిన నిధులను వినియోగించుకుంది. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు నీటి పథకాల పనులు పూర్తిగా నిలిపివేశారు.

ఏఐబీ నిధులతో ఆయా మునిసిపాల్టీలలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను రూపొందించి టెండర్లు నిర్వహించి పనులను చేపట్టింది. నీటి నిల్వ, చెరువుల ఆధునీకీకరణ, పైపులైన్ల నిర్మాణం, నీటి సరఫరాకు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, నీటి శుద్ధి ప్లాంట్ల విస్తరణ వంటి పనులను చేపట్టారు. ఈ పనులు ముందుకు సాగకపోవడంతో గుంటూరు కార్పొరేషన్, మంగళగిరి, తాడేపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలలో తాగు నీటి సమస్యలను పౌరులు ఎదుర్కొంటున్నారు.

తాగు నీటి సరఫరా కూడా అరకొరగానే జరుగుతోంది. ఆయా పనులు పూర్తి చేస్తే పుష్కలంగా ప్రజలకు తాగునీరు అందుతుంది. పల్నాడు జిల్లాలోని వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలలో సుమారు 295 కోట్లలో నీటి పథకాల పనులు చేపట్టారు. మాచర్ల మునిసిపాల్టీలో రూ సుమారు 55 కోట్ల వ్యయంతో పనులు చేపట్టగా 10 శాతం లోపే పనులు పూర్తయ్యాయి. పిడుగురాళ్ళ మునిసిపాల్టీలో రూ 102 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. ఇక్కడ మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. ఈ పనులు 20 శాతం కూడా పూర్తి కాలేదు. వినుకొండలో రూ 138 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు ముందుకు సాగలేదు. ఇక్కడ కూడా 20 శాతం లోపే పనులు పూర్తయ్యాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో సుమారు 68.10 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. వీటిలో రూ 34.45 లక్షల విలువైన పనులు మాత్రమే పూర్తయినట్టు కార్పొరేషన్ లెక్కలు తెలియజేస్తున్నాయి. మంగళగిరి, తాడేపల్లి మునిసిపాల్టీల పరిధిలో సుమరు రూ 102 కోట్ల వ్యయంతో చేపట్టిన పనుల్లో కేవలం రూ 92.56 లక్షల విలువైన పనులు మాత్రమే పూర్తి చేసినట్టు ప్రగతి నివేదికలు తెలియజేస్తున్నాయి. ఆయా పనులను పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు పనులు నిర్వహణపై సమీక్షలు కూడా నిర్వహించారు. ఈ పనులు పూర్తి చేస్తే ఆయా పట్టణాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

నీటి పథకాల నిర్వహణలో నూతన విధానం

పట్టణాల్లో నీటి పథకాల నిర్వహణపై ప్రభుత్వం నూతన విధానం అమల్లోకి తీసుకురావాలని యోచిస్తుంది. ఈ మేరకు ఇతర రాష్ట్రాల్లో నీటి పథకాల నిర్వహణపై అధ్యయనం కూడా నిర్వహించింది. సదరు అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తోంది. తాగు నీటి పథకాలు నిర్మించిన కాంట్రాక్టర్‌రే 15 ఏళ్ల పాటు వాటి నిర్వహణ బాధ్యతలు అప్పగించాలన్న అంశంపై మేథోమథనం చేస్తున్నారు. ఏదైనా మునిసిపాల్టీలో తాగునీటి పథకం విస్తరణ, నూతన పథకం నిర్మాణం టెండర్ పద్ధతిలో చేపడుతున్నారు. పనులు పొందిన కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్టర్లకు పనులను అప్పగిస్తున్నారు. లాభార్జనకు ప్రధాన్యత ఇస్తున్న కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేస్తున్నారు. పనులు పూర్తి చేసి స్కీమ్ మునిసిపాల్టీలకు అప్పగించి కాంట్రాక్టర్ బిల్లులు తీసుకుంటున్నాడు. నాసిరకంగా పనులు జరగడంతో స్కీమ్ రెండు మూడేళ్లలోనే మూలనపడుతోంది. ఇటువంటి సంఘటలను ప్రభుత్వం గుర్తించింది. స్కీమ్ పూర్తి చేసిన కాంట్రాక్టర్‌కే 15 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు అప్పగించే విధానంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీని వలన పనులు నాణ్యతలో జరగడంతో పాటు వెచ్చించిన నిధులు నిరూపయోగం కాకుండా ఉండటంతో పాటు మంచి నీటి పథకాలు పూర్తి స్థాయిలో పనిచేస్తాయన్న అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్టు తెలిసింది. అయితే ఈ విధానం అమలుపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఈ విధానం అమలు జరిగితే నీటి పథకాలు పూర్తి స్థాయిలో ప్రజా వినియోగంలో ఉండే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.



ఎప్పటి నుంచో పేదలను ఊరిస్తున్న ఉచిత సిలిండర్ పథకం లబ్ధిదారులకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది. ఎలాంటి సమస్యలు లేకుండా తమకు ఉచితంగా గ్యాసు సిలిండర్లు వస్తాయని భావించినవారిలో చాలా మందికి నిరాశ ఎదురవుతోంది. ఈ- కేవైసీ లేనికారణంగా కొంతమంది, రేషన్ కార్డు లేనందున కొంతమంది లబ్ధిదారులు ఉచిత సిలిండర్లు కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో లబ్ధిదారుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమవుతోంది.

దీపం-2.. ఈ-కేవైసీ కష్టాలు

- ఈ కేవైసీ ఉన్నవారికే ఉచిత సిలిండర్లు
- ఈ కేవైసీపై అవగాహనా లేమితో లబ్ధిదారులకు నష్టం
- రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో మరింత మందికి కట్
- గత ప్రభుత్వ హయాంలో 25వేల దరఖాస్తులు పెండింగ్

గుంటూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 19.5 లక్షల వంట గ్యాసు కనెక్షన్లు వున్నాయి. గుంటూరు జిల్లాలోనే 7 లక్షల కనెక్షన్లు వుండగా, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 12.5 వేల గ్యాసు కనెక్షన్లు వున్నాయి. వీరందరికీ ఈ-కేవైసీ వుంటేనే ప్రస్తుతం ఉచిత గ్యాస్ సిలిండర్లు వస్తాయని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఎల్‌పీజీలో గ్యాస్ కనెక్షన్ తీసుకున్న సమయంలో గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్‌ను లింక్ చేయాలి. ఆధార్ లింక్ చేసిన బ్యాంకు ఖాతాతో గ్యాస్ కనెక్షన్‌ను అనుసంధానం చేయాలి. ఈ మొత్తం ప్రక్రియను ఈ- కేవైసీ అంటారు. అయితే దీనిపై సగటు వినియోగదారులకు అవగాహన లేదు. ఎప్పుడో గ్యాస్ కనెక్షన్ తీసుకున్న సమయంలో ఈ-కేవైసీ చేయించుకుని ఆ తరువాత దాన్ని మర్చిపోయారు. అయితే ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ-కేవైసీని ఆయిల్ సంస్థలు అప్‌డేట్ చేసుకుంటూ ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై అవగాహన లేక ఈ కేవైసీని చాలా మంది నిర్లక్ష్యం చేశా రు. ఈ కేవైసీ గ్యాసుపై సబ్సిడీ వస్తుంది. అయితే ఇటీవల కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ 15 రూపాయలకు పడిపోవ డంతో ఎవరూ ఈ కేవైసీ విషయాన్ని అంతగా పట్టించు కోలేదు. సబ్సిడీ పడుతుందో.. లేదో కూడా చూసుకోని పరిస్థితి ఏర్పడింది. దీంతో మూడు జిల్లాల్లో అనేకమందికి ఈ- కేవైసీ లేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై పౌర సరఫరాల శాఖ అధికారులు, ఎల్పీజీ సంస్థలు, గ్యాసు ఏజెన్సీలు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.


రేషన్ కార్డుల తంటా..

ఉచిత గ్యాస్ సిలిండర్లు అందివ్వడానికి ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటోంది. అయితే మూడు జిల్లాల్లో మొత్తం 19.5 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి, కానీ ప్రభుత్వ గణాంకాల ప్రకారం 17లక్షల రేషన్ కార్డులు మాత్రమే ఉన్నాయి. అంటే రెండున్నర లక్షల గ్యాస్ కనెక్షన్లకు రేషన్ కార్డులు లేవు. దీంతో వీరంతా ఈ పథకానికి అనర్హులు అయ్యే అవకాశం కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవు. గడిచిన ఐదేళ్లలో పెళ్లిళ్లు చేసుకుని కొత్త జీవితం ప్రారంభించిన దంపతులకు కొత్త రేషన్ కార్డులు ఇప్పటికీ రాని పరిస్థితి. కుటుంబాలు వేరైన తరువాత పాత రేషన్ కార్డులను విభజనకు దరఖాస్తు చేసుకున్నా వేర్వేరు కార్డులు రాలేదు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో లక్షా 60వేలు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 30వేల రేషన్ కార్డు దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. దరఖాస్తు చేసుకోనివారు అంతకు మించిన సంఖ్యలో వున్నారు. ప్రస్తుతం వీరంతా ఈ పథకానికి దూరమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. మొత్తంగా ఈ-కేవైసీ, రేషన్ కార్డుల వ్యవహారంతో మూడు జిల్లాల్లో 14 లక్షలకు మించి అర్హులు ఉండకపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం ఈ సమస్యలను చక్కదిద్ది ఎక్కువమంది లబ్దిదారులకు మేలు చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ- కేవైసీ ఇలా..

స్థానికంగా వున్న ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి ప్రతి ఒక్కరూ ఈ- కేవైసీని చేయించుకోవచ్చు. కేవైసీ అప్‌డేట్ అయి వుంటే అవసరం లేదు.. లేని పక్షంలో బయోమెట్రిక్ పద్ధతిలోగానీ, ఆధార్ ఓటీపీ ద్వారాగానీ ఈ- కేవైసీ చేయించుకోవచ్చు.

- గ్యాస్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్ కూడా ఈ కేవైసీ చేయవచ్చు. గ్యాస్ డెలివరీ బాయ్ ఇంటికి వచ్చిన సమయంలో అతడికి మన గ్యాస్ కనెక్షన్ వివరాలు చెబితే అతడు తన వద్దనున్న సంబంధిత గ్యాస్ (ఇండేన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్) ఏజెన్సీల మొబైల్ యాప్‌లో ఆధార్ ఓటీపీ పద్ధతిలో ఈ- కేవైసీ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.
- ఎవరికి వారుగా కూడా ఈ- కేవైసీ చేసుకోవచ్చు. ఆయా సంస్థకు సంబంధించి యాప్‌ను మొబైల్లో డౌన్లోడ్ చేసుకోవాలి. అందులో తొలుత రిజిస్టర్ అవ్వాలి. ఎగ్జిస్టింగ్ కస్టమర్ దగ్గర ఎస్ అనే ఆప్షన్‌ను ఎంచుకుంటే రిజిస్ట్రేషన్ పేజీలోకి వెళుతుంది. అక్కడ ఎల్‌పీజీ ఎన్‌రోల్‌మెంట్ మొబైల్ నెంబర్ ఇచ్చి సబ్‌మిట్ చేయాలి. ఆ తరువాత పేజీలో పేరు, పుట్టిన తేదీ, ఈ మెయిల్(ఆప్షనల్) ఇచ్చి రిజిస్టర్ కావాలి. దానికి సెక్యూరిటీగా నాలుగంకెల ఎం పిన్‌ను సెట్ చేసుకోవాలి. ఇలా రిజిస్టర్ అయిన తరువాత మొబైల్ నెంబర్, ఎంపిన్‌తో లాగిన్ అవ్వాలి. డాష్‌బోర్డు వస్తుంది. అందులో ఎల్‌పీజీ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఆ తరువాత ఈ కేవైసీ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. ఈ- కేవైసీ గతంలోనే అయిపోయి వుంటే ఈ కేవైసీ సక్సెస్‌ఫుల్ అని చూపిస్తుంది. పెండింగ్ ఉంటే క్యాప్చర్ ఫేస్ అనే ఆప్షన్ వస్తుంది. దాన్ని క్లిక్ చేసి మొబైల్ ఫోన్‌ను ముఖానికి దగ్గరగా తీసుకుని వెళ్లి కళ్లు మూస్తూ, తెరుస్తూ వుండాలి. అప్పుడు అది ఫేస్ రికగ్నిషన్‌ను క్యాప్చర్ చేసుకుని ఈ- కేవైసీ ప్రక్రియను పూర్తి చేస్తుంది. అనంతరం గ్యాస్ కనెక్షన్‌కు లింకైన బ్యాంకు ఖాతా యాక్టివేషన్‌ను కూడా అదే యాప్‌లో చూసుకుని తెలుసుకోవచ్చు. యాక్టివ్ అని వుంటే ఇబ్బంది లేదు.. అలా కాకుంటే బ్యాంకుకు వెళ్లి ఖాతాను యాక్టివేట్ చేయించుకోవాలి.



క్రోసూరు నివాస ప్రాంతాల ఏరియల్ వ్యూ

రెవెన్యూ తప్పులు.. ప్రజలకు తిప్పలు

- చెరువు భూమిగా నమోదైన నివాస ప్రాంతం
- క్రయ విక్రయాలు లేక అవస్థలు
- రీ సర్వే చేసి దశాబ్దం గడుస్తున్నా దక్కని ఫలితం

క్రోసూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు చేసిన తప్పులు ఆ గ్రామస్తులకు తిప్పలు మిగిల్చింది. రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదు చేసే క్రమంలో, నివాస ప్రాంత సర్వే నంబరును, చెరువు నంబరులో రికార్డు చేయడంతో క్రయ విక్రయాలు నిలిచి 2500 కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్రోసూరులోని అందుకూరు రోడ్డు కూడలి నుంచి కొండ కింద బజారు వరకు నివాస స్థలాలతో పాటు మండల కేంద్రానికి తల మానికంగా నిలిచిన సామాజిక చెరువు 594ఏ2 సర్వే నంబరుతో నమోదై ఉంది. ఈ సర్వే నెంబరులోని మొత్తం 485.24 ఎకరాల విస్తీర్ణంలోని భూమిలో సుమారు 461 ఎకరాలు చెరువు కింద, మరో 24 ఎకరాలు నివాస ప్రాంత భూమిగా ఉంది. ఈ 24 ఎకరాల స్థలంలోనే సుమారు 2500 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. గతంలో అదే సర్వే నంబరు పై కొనుగోళ్ళు, అమ్మకాలు జరిపే వారు. ఐతే దశాబ్ద కాలం క్రితం 2015లో ప్రభుత్వం భూ రికార్డులన్నీ ఆన్‌లైన్ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో అదే సర్వే నెంబరు పై ఉన్న 485.24 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు చెరువు భూమిగా నమోదు చేశారు. అప్పటి నుంచి ప్రజలకు తిప్పలు ప్రారంభమయ్యాయి. క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్‌లు నిలిచి పోయాయి. సమస్యను పరిష్కరించాలని వారు ఎన్నో సార్లు జిల్లా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించారు.

2016లో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా ఉన్న కోన శశిధర్ స్పందించి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నేతృత్వంలో పలువురు సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు గ్రామంలో రీ సర్వే చేపట్టారు. 594ఏ2 సర్వే నెంబరులోని చెరువు భూమి గ్రామ కంఠం భూముల వివరాలను పరిశీలించారు. మొత్తం 485.24 ఎకరాల భూమిలో 461 ఎకరాల్లో చెరువు, 24 ఎకరాల్లో పక్కా గృహాలు ఉన్నట్టు రికార్డుల్లో గుర్తించారు. రెవెన్యూ అధికారులు పొరపాటుగా 594ఏ2 సర్వే నెంబరులో ఉన్న గ్రామ కంఠం భూములను కూడా నిషేధిత భూముల జాబితాలో చేర్చినట్టు గుర్తించారు. తమ కష్టాలు తీర్చాలని అప్పట్లో గ్రామస్తులు సర్వే అధికారులకు మొర పెట్టుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సదరు భూమి నంతటిని జీపీఎస్ ద్వారా చుట్టు పక్కల భూముల హద్దులతో చెరువు పోరంబోకు భూమి, గ్రామ కంఠం భూములను గుర్తించారు. చెరువు పోరంబోకు భూమి అసలు విస్తీర్ణం ఎంత? గ్రామ కంఠం భూమి విస్తీర్ణం ఎంత అనే దానిపై సర్వే నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు 2016లోనే అందజేశారు. 594 ఏ2బీ సర్వే నెంబరులో గ్రామ కంఠంలో నివసిస్తున్న ప్రజలకు రిజిస్టర్లు జరిగే విధంగా చర్యలు చేపడదామని హామీ ఇచ్చారు. ప్రజలు అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరీక్షిస్తూనే ఉన్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం సమస్య ప్రభుత్వ స్థాయిలో పరిష్కారం కావాల్సి ఉందని, గెజిట్ నోటిఫికేషన్ విడుదల ఐతే కాని చెరువు భూమిని, గ్రామ కంఠం భూమిని విడగొట్టలేమిని చెపుతున్నారు. నివాస ప్రాంత భూముల్లోనే క్రోసూరు పంచాయతీ కార్యాలయం, సచివాలయ కార్యాలయంతో పాటు శాత వాహన కాలం నాటి వీరభద్ర స్వామి, విశ్వేశ్వర స్వామి దేవాలయాలు కూడా ఉన్నాయి.

కాలం గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు : ఎం పోతురాజు



చెరువు భూమి, గ్రామ కంఠం భూములను విడి విడి సర్వే నెంబర్లతో నమోదు చేయాలి. రీ సర్వే చేసి దశాబ్ద కాలం గడుస్తున్నా సర్వే అధికారులు సబ్ డివిజన్ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. రికార్డుల్లో స్థలాలు నమోదవకపోవటం వల్ల క్రయ విక్రయాలు జరుపుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉంది.

రెవెన్యూ అధికారుల తప్పులకు మేము శిక్ష అనుభవిస్తున్నాం : కే మహేశ్వరరావు



2015 వరకు రెవెన్యూ కీ రిజిస్టర్‌లో, సబ్ రిజిస్ట్రార్ రికార్డుల్లో గ్రామ కంఠంగా చూపిన భూమిని ఆన్‌లైన్ చేసే సందర్భంలో రెవెన్యూ అధికారులు చేసిన పొరపాట్లకు మేము శిక్ష అనుభవించాల్సి వస్తుంది. రెవెన్యూ రికార్డుల్లో తమ స్థలాలు లేక పోవటంతో కుటుంబ అవసరాలకు ఊడా ఏ ఒక్కరు రుణ ఇవ్వటం లేదు. ఆస్తులు ఉండి కూడా అమ్ముకోలేక పోతున్నాం. ప్రభుత్వ అధికారులే తమ పొరపాట్లను సరిదిద్దు కోవాలి.



క్రోసూరు చెరువు

విద్యార్థులకు అపార్ కష్టాలు

- పాఠశాల, ఆధార్ రికార్డుల్లో భారీ వ్యత్యాసం
- నిర్దేశిత సంఖ్యలో లేని ఆధార్ నమోదు కేంద్రాలు
- నమోదులో జిల్లా 22వ స్థానం

గుంటూరు(విద్య), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు "వన్ నేషన్ వన్ కార్డ్" పేరుతో ప్రత్యేకంగా కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అపార్ (పర్మినెంట్ అక్కడ మీకు అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, పాఠశాలల్లో దాదాపు 7 లక్షల మందికి, జూనియర్ కళాశాలలో 95 వేల మందికి కార్డులు ఇవ్వాల్సి ఉంది. అయితే నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వేగం పుంజుకోలేదు. ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని కేంద్రం నుంచి ఆదేశాల ఉన్నా ఆ దిశగా జిల్లాలో నమోదు ప్రక్రియ సాగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఆధార్ పాఠశాల రికార్డులకు పొంతనలేదు

విద్యార్థులకు సంబంధించి ఆధార్ కార్డులో ఉన్న వివరాలకు, పాఠశాలలో ఉన్న రికార్డులకు పొంతన ఉండటం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పుట్టిన తేదీ, చిరునామా, తల్లిదండ్రుల పేర్లు వంటివి పాఠశాల రికార్డులకు, ఆధార్‌లో ఒకే విధంగా ఉంటేనే నమోదు జరుగుతుంది. ఆధార్‌లో ఉన్న రికార్డుల ప్రకారమే ఆపార్ కార్డులు జారీ అవుతాయి. అనేక మంది విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు ఆధార్‌లో సక్రమంగా లేవని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే నిర్దేశించిన సంఖ్యలో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ఆధార్‌లో ఉన్న తప్పులు సరిచేసుకోవడం ఇబ్బందికరంగా మారిందనే వాదన ఉంది.

నాటి విద్యాశాఖ అధికారి నిర్లక్ష్యం

ఉమ్మడి జిల్లా అపార్ నమోదులో 22వ స్థానంలో ఉంది. దీనికి ప్రధాన కారణం ఇప్పటిదాకా ఇక్కడ పనిచేసిన విద్యాశాఖ అధికారి కారణమని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. తాము ఎన్నిసార్లు క్షేత్ర స్థాయిలో తలెత్తే సాంకేతిక సమస్యలు వివరించినా పట్టించుకోలేదని చెబుతున్నారు ఉన్నతాధికారులతో మాట్లాడి ఆధార్ కేంద్రాలు పెంచాలని విజ్ఞప్తి చేసినా ఆమె పట్టించుకోలేదని చెబుతున్నారు.



అపార్‌తో అనేక ఉపయోగాలు...

ఆపార్ కార్డు వల్ల విద్యార్థులకు అనేక ఉపయోగాలు ఉంటాయి. విద్యార్థికి సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు డిజీ లాకర్లకు అనుసంధానమైపోతాయి. నకిలీ సర్టిఫికెట్లకు ఆస్కారం ఉండదు. ఉపకార వేతనాలు, క్రీడలు, కుల ఆదాయ, స్థానికత ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థులకు సంబంధించిన సమస్త వివరాలు ఇందులో నమోదు అవుతాయి. ఎప్పుడైనా ఇవి పొందడానికి అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఆస్కారం ఏర్పడుతుంది.

సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి

కె.బసవలింగారావు



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)లో విద్యార్థుల వివరాలు నమోదు తలెత్తే సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అధ్యక్షులు కె బసవలింగారావు సూచించారు. ఇప్పటికే తాము డీఈవోకి వినతి పత్రం అందజేశామని తెలిపారు. విద్యార్థి స్కూల్ రికార్డులో వాటికి భిన్నంగా తల్లిదండ్రు పుట్టిన తేదీ, తల్లీదండ్రి పేర్లు సమర్పిస్తున్నారని తెలిపారు. వాటిని సవరించడానికి ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించడం లేదని తెలిపారు.

టీటీడీ బోర్డులో గిరిజనులకు అవకాశం కల్పించాలి

గుంటూరు(విద్య) నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిలో గిరిజనులకు చోటు కల్పించాలని గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ పాండు నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో హతిరాంబాబాజీ భక్తులుగా ఖ్యాతి గడించిన గిరిజనులకు అవకాశం ఇవ్వాలని కోరారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి గిరిజనులకు బోర్డులో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో టీటీడీ బోర్డులో గిరిజనులకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. అవకాశం కల్పించకపోతే అందోళన చేస్తామని ప్రకటించారు.

విజిలెన్స్ ఏవోగా ఆదినారాయణ నియామకం

గుంటూరు సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖలో హాట్ టాపిక్‌గా మారిన విజిలెన్స్ వ్యవసాయాధికారి పోస్టు వ్యవహారానికి తెరపడింది. గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఏవోగా చల్లగుండ్ల ఆదినారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు విజిలెన్స్ డీజీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆదినారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. ప్రకాశం జిల్లా యద్దనపూడి ఏవోగా పనిచేస్తున్న ఆదినారాయణ రెండేళ్ల పాటు డిప్యూటేషన్‌పై విజిలెన్స్‌లో కొనసాగే అవకాశం ఉంది.

పుణ్యస్నానాలతో పులకిస్తున్న భక్తులు

- సూర్యలంక తీరంలో కార్తీక మాసం సందడి

బాపట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం కావటంతోపాటు తొలి ఆదివారం భక్తజనం విశేష సంఖ్యలో సూర్యలంక సముద్రతీరానికి వచ్చి పుణ్యస్నానాలతో పులకించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి ఇసుకతో శివలింగాలు ఏర్పాటు చేసి కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తులతోపాటు పర్యాటకులు కూడా పెద్దసంఖ్యలో తరలి రావటంతో తీరం జనంతో నిండిపోయింది. తీరం పొడవున స్నానాలు ఆచరిస్తూ, పూజలు చేస్తున్న భక్తులకు అధికారులు వసతులు కల్పించారు. భక్తుల భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మరపడవలలో గజఈతగాళ్లు, మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహించారు. బాపట్ల పరిసర ప్రాంతాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తజనం విచ్చేసి కార్తీక మాస పూజలు చేశారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు.

ప్రత్యేక సౌకర్యాలు

సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు విచ్చేసే భక్తులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. రూరల్ పోలీసులతో కలిసి ఆదివారం సాయంత్రం తీరంలో డ్రోన్ ప్రదర్శన నిర్వహించారు. సముద్రస్నానాలు ఆచరించే భక్తుల భద్రత కోసం డ్రోన్‌ల ద్వారా సమీక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్విమ్మర్లను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. చిల్లర దొంగతనాలు జరగకుండా ప్రత్యేక పోలీసు గస్తీ ఏర్పాటు చేశామన్నారు. కార్తీక పౌర్ణమి వరకు భక్తులకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సముద్ర లోతులకు భక్తులు వెళ్లకుండా జెండాలు ఏర్పాటు చేసి మరపడవలలో గజఈతగాళ్లు తిరుగుతూ ఉంటారన్నారు. ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ భక్తులను అప్రమత్తం చేస్తుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సూర్యలంక సముద్ర తీరంలో పుణ్యస్నానాలు

నేటి కార్తీక సోమవారానికి ఏర్పాట్లు

కార్తీక మాసంలో మహాశివునికి అత్యంత ప్రీతికరమైన కార్తీక సోమవారం రోజు భక్తజనం తెల్లవారుజామున తలస్నానాలు చేసి శివాలయాలకు వెళ్లి కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కార్తీకమాసం తొలి సోమవారం రోజు బాపట్ల పట్టణ, మండలంలోని పలు శివాలయాల్లో తెల్లవారుజామున నిర్వహించే పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రసిద్ధిగాంచిన సోమేశ్వరస్వామి దేవాలయం, ఎస్ఎన్‌పీ అగ్రహారంలోని శివాలయం, సూర్యలంక సముద్రతీరంలో నూతనంగా నిర్మించిన శివక్షేత్రంలో పూజలకు ఏర్పాట్లు చేశారు. సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు తెల్లవారుజామునే వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, వసతులు కల్పించారు. ముఖ్యంగా జల్లు స్నానం కోసం షవర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే బయోటాయిలెట్స్ ఏర్పాటు చేశారు. ఇందులో మహిళల కోసం 25, పురుషుల కోసం 15 సిద్ధం చేశారు. మూడు ప్రాంతాల్లో షవర్లు, దుస్తులు మార్చుకునే సౌకర్యాలు 150 తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు.



సూర్యలంక సముద్రతీరంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన బయోటాయిలెట్స్

పకడ్బందీగా దూర విద్య పరీక్షలు

- దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు



తాడికొండలో దూరవిద్య పరీక్షల కేంద్రంలో తనిఖీ చేస్తున్న డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు

పెదకాకాని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న దూరవిద్య పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు ఆదివారం వెల్లడించారు. గత నెల 27వ తేదీ నుంచి దూరవిద్య కేంద్రం పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా 114 కేంద్రాల్లో జరుగుతున్నాయని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక పరిశీలకులను నియమించామన్నారు. స్క్వాడ్ బృందాలు, రీజనల్ కోఆర్డినేటర్‌ల ద్వారా పకడ్బందీగా, సజావుగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు ఆయా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే డైరెక్టర్‌గా తాను తాడికొండలోని బీఎస్ఎస్‌బీ కళాశాల, యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ప్రబల లక్ష్మీ నారాయణ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలు, మౌలిక వసతులపై పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు ఆయన సూచించారు.

డెలివరీ అయిన భార్యను చూసి వస్తూ మృతి



రాయపూడి రోశయ్య (ఫైల్)

సత్తెనపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డెలివరీ అయిన భార్యను చూసి వస్తుండగా జరిగిన ప్రమాదంలో భర్త, అతని స్నేహితుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీ పెద్దకాలువ వద్ద ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో క్రోసూరు మండలం 88 తాళ్ళూరుకు చెందిన రాయపూడి రోశయ్య(27), అతని స్నేహితుడైన కట్టా వీరేంద్ర(18) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ధూళిపాళ్ల సమీపంలోని కోల్డ్ స్టోరేజ్‌లో రోశయ్య పని చేస్తుంటాడు. రోశయ్య భార్య యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో డెలివరీ కావటంతో ఆమెను చూసేందుకు తన స్నేహితుడు వీరేంద్రతో కలిసి వెళ్లాడు. చూసిన తరువాత ఇంట్లోకి ఫ్యాన్ అవసరం కావడంతో కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న ఫ్యాన్ తీసుకొచ్చేందుకు ఇద్దరూ బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో వారు ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీ పెద్దకాలువ వద్దకు రాగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వీరేంద్రకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు ఆటో ఢీకొనటం వలన ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నట్టు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ పంచారామాలకు అనూహ్య స్పందన

- తొలి రోజే నాలుగు సర్వీసులు
- 24 గంటల్లో దర్శించుకునేలా ఏర్పాట్లు

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసంలో 24 గంటల్లో పంచారామాలను దర్శించుకునేలా ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చిన పంచారామాల సర్వీసులకు భక్తుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. తొలి రోజు శనివారం రాత్రి గుంటూరు-1, 2 డిపోల నుంచి రెండేసి చొప్పున నాలుగు సర్వీసులు ప్రారంభమయ్యాయి. రెండో రోజు ఆదివారం రాత్రి గుంటూరు-2 డిపో నుంచి మరో మూడు సర్వీసులు బయల్దేరటం భక్తుల ఆదరణను తెలియజేస్తోంది. కార్తీక మాసంలో ప్రతి శని, ఆదివారం రాత్రి సమయాల్లో బస్టాండ్ నుంచి పంచారామాలైన సామర్లకోట, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, అమరావతి క్షేత్రాలకు 24 గంటల్లో అంటే రాత్రి 9 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి అదే సమయానికి తిరిగి బస్టాండ్‌కు చేరుకునేలా సర్వీసులను సిద్ధం చేశారు. గుంటూరు-1, 2 డిపోలతో పాటు తెనాలి, మంగళగిరి, పొన్నూరు డిపోలలో కూడా పంచారామాల సర్వీసులను సిద్ధం చేశారు. ఆయా క్షేత్రాలకు చేరుకున్న భక్తులకు క్యూలైన్‌లలో త్వరితగతిన దర్శనాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అలానే అయ్యప్పస్వాముల కోసం అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు బస్సులను సిద్ధం చేశారు. అలాగే త్రిశైవ క్షేత్రాలైన శ్రీశైలం, యాగంటి, మహానంది క్షేత్రాలకు కూడా బస్సులను ఏర్పాటు చేశారు. శబరిమల యాత్రకు 6, 8, 12 రోజుల టూర్ ప్యాకేజీలను సిద్ధం చే సినట్లు డీపీటీవో రవికాంత్ తెలిపారు.

మహిళా కార్మికులను కంపెనీ ఆదుకోవాలి



అస్వస్థతకు గురైన మహిళా కార్మికులను పరామర్శిస్తున్న సీపీఎంఎల్ నాయకురాలు శోభారాణి

రేపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళా కార్మికులు కోలుకునేంతవరకు కంపెనీ యాజమాన్యమే ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఎంఎల్ నాయకురాలు మండవ శోభారాణి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె బాధిత మహిళా కార్మికులను పరామర్శించిన అనంతరం మాట్లాడుతూ పదుల సంఖ్యలో మహిళా కార్మికులు అనారోగ్యానికి గురై ఆరోగ్యం క్షీణించిన ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రమాదం జరిగి రెండురోజులు కావస్తున్న కంపెనీ యాజమాన్యంపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ ప్రశ్నించారు. గుజరాత్, ఉభయగోదావరి జిల్లాల్లో ఇలాంటి సంఘటనలు జరిగితే తక్షణమే కేసులు నమోదు చేశారని, ఇక్కడ ఆ పరిస్థితి లేదన్నారు. అస్వస్థతకు గురైన మహిళలు ఎన్నిరోజులు సెలవులు పెడితే అన్నిరోజులు జీతభత్యాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఇద్దరి పరిస్థితి విషయం

రాయల్ మెరైన్ రొయ్యల కంపెనీలో హైడ్రోక్లోరిక్ యాసిడ్ రిలీజ్ అవ్వటంతో విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికులు నిన్న కోలుకోగా ఆదివారం ఆరుగురు మహిళా కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హుటాహుటిన కుటుంబసభ్యులు నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ఎన్ఆర్ఐ వైద్యశాలకు తరలించారు. సంఘటన జరిగి రెండోరోజులైన పోలీసులు కేసు నమోదు చేసిన దాఖలాల్లేవు. అధికార పార్టీకి చెందిన ఓ నేత కేసు నమోదు చేయవద్దని ఆదేశాలు జారీ చేయటంతో పోలీసులు అయోమయ స్థితిలో ఉన్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై నిజాంపట్నం ఎస్ఐ తిరుమలరావును వివరణకోరగా ఎవరూ ఫిర్యాదు చేయని కారణంగా కేసు నమోదు చేయలేదని తెలిపారు.

భర్త వివాహేతర సంబంధం.. భార్య ఆత్మహత్య

రేపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భార్యభర్తల గొడవల కారణంగా మండలంలోని పిరాట్లంక గ్రామానికి చెందిన తోట శివనాగులు(30) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. తన భర్త వేరే అమ్మాయితే వివాహేతర సంబంధం పెట్టుకోవటంతో భార్యభర్తల మధ్య గత సంవత్సర కాలంగా గొడవలు జరుగుతున్నాయి. భర్త తోట రాజేష్ వేరే అమ్మాయితో అక్రమ సంబంధం పెట్టుకుని ఇంటికి తీసుకువస్తానని బెదిరించటంతో భార్య శివనాగులు ఓర్చుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న బంధువులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తీసుకువచ్చారు. శివనాగులు తల్లి కనకలక్ష్మి ఫిర్యాదు చేయడంతో చోడాయపాలెం ఎస్ఐ జ్యోతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివనాగులుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా లక్ష్మణరావు

గుంటూరు (విద్య) నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావు పేరును ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్), యూటీఎఫ్ సంఘాల నాయకులు ప్రకటించారు. ఈ మేరకు గుంటూరులో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ శాసనమండలి పునరుద్ధరించిన తరువాత ఎన్నికైన పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు. 2007 నుంచి 2024 వరకు 13 మంది పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్టు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్, నిరుద్యోగ, రైతాంగ, మహిళా ఉద్యోగుల సమస్యలపై శాసన మండలిలో గళం వినిపించారని వివరించారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించేలా ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల స్థానాలు ఉండాలని, అయితే రాజకీయ పార్టీలు ఆ లక్ష్యాలను దెబ్బతీస్తున్నాయని అందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అనేక ప్రజా సంఘాలు ప్రత్యేకంగా మద్దతు ఇవ్వడం హర్షణీయం అన్నారు. సమావేశంలో యూటీఫ్ నాయకులు ఎం.హనుమంతరావు, కళాధర్ సీఐటీయూ నాయకులు లక్ష్మీనారాయణ, ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం నాయకులు వీవీకే సురేష్, ఆల్ ఇండియా లాయర్ అసోసియేషన్ నాయకులు నర్రా శ్రీనివాసరావు, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు సాంబశివరావు, కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నాయకులు స్వాతి, మున్సిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు ముత్యాలరావు, అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకులు చిన్న వెంకాయమ్మ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావుకు మద్దతు తెలియజేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 30,535 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 33,589 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర


- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి



మాట్లాడుతున్న చెన్నుపాటి మంజుల

గుంటూరు(విద్య), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల మొండి బకాయిలను వెంటనే చెల్లించాలని, అనవసరపు యాప్‌లతో విద్యాబోధనకు అడ్డంకులు సృష్టించరాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల రోడ్డులోని ఎన్జీవోహోమ్‌లో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమానికి ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ అధ్యక్షత వహించారు. చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ ఆర్నెల్ల నుంచి ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు కోట్ల రూపాయల్లో పేరుకుపోయాయని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ బకాయిలు, 90 నెలల పెండింగ్ డీఏలు ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఐ.బి. కరిక్యులమ్, బైజూస్, టోఫెల్ ఆచరణలో విఫలమయ్యాయన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ సబ్జెక్ట్ టీచర్స్ ఖాళీలను భర్తీ చేయాలని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలాని, ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా శాఖ ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, పి.పార్వతి, పి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులు ఎస్ఎస్ఎన్ మూర్తి, జి.దాస్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డి.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

53 లీటర్ల నాటుసారా స్వాధీనం

వెల్దుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంకుడు చెట్టు తండా, మండాది గ్రామాల్లో ఆదివారం దాడులు నిర్వహించి 53 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సమందర్‌వలి తెలిపారు. కుంకుడుచెట్టు తండాలో బయన్న అనే వ్యక్తి వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారాతోపాటు 200 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే మండాది గ్రామ శివారులో రామ్మోహన్ అనే వ్యక్తి వద్ద నుంచి 23 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు ప్రజా దర్బార్ వాయిదా

బెల్లంకొండ, నవంబరు3(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో సోమవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నిర్వహించనున్న ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఈనెల 11వ తేదీకి వాయిదా వేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనివార్య కారణాలతో ఎమ్మెల్యే హాజరుకాలేక పోతుండటంతోనే వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని మండల ప్రజలు గమనించాలని సూచించారు.

ఏజీపీగా కాశీవిశ్వనాథం

పిడుగురాళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గురజాల 10వ అదనపు జిల్లా కోర్టు, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్) గా సీనియర్ న్యాయవాది కరణం కాశీవిశ్వనాథంను నియమిస్తూ కలెక్టర్ అరుణ్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. కొన్నేళ్లుగా ఈ కోర్టుల్లో ఏజీపీ నియామకం లేకపోవడంతో ప్రభుత్వ పరంగా అనేక కేసుల పరిష్కారంలో జరుగుతున్న జాప్యాన్ని దృష్టిలో వుంచుకొని కలెక్టర్ అరుణ్‌బాబు ఏజీపీగా కరణం కాశీవిశ్వనాథంను నియమించారు.

ఆలయంలో అన్నదానం

మాచర్లటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో నడక బృందం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన అన్నదానం కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో తిరుపతయ్య, కోటేశ్వరరావు, కాసులు, కోటిరెడ్డి, వెంకటనారాయణ, పులుసు చంద్రారెడ్డి, వీరారెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



జంగాను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

జంగాకు అభినందనలు

కారంపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలక మండలి సభ్యుడిగా నియమితులైన జంగా కృష్ణమూర్తిని ఆదివారం టీడీపీ నేతలు గుంటూరులోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువలతో, పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గోళ్ల సురేష్ యాదవ్, గుండాల శ్రీనివాస్ యాదవ్, చిన శ్రీను, గుర్రపుసాల శ్రీనివాసరావు, లక్ష్మయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

దాచేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో మృతి చెందిన కోలా శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పంపిన రూ.20 వేల నగదును స్థానిక టీడీపీ నేతలు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ ముశ్యం సీతారామయ్య, ముశ్యం శ్రీనివాసరావు, షేక్ నజీర్, షేక్ సైదా, సయ్యద్ రసూల్, చినజానీబాష పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి

కమిటీ చైర్మన్‌గా బుజ్జి

దాచేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భట్రుపాలెం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా వేముల బుజ్జి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో చల్లా సుబ్బలక్ష్మీ వైస్‌చైర్మన్‌గా, మరో 15 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. దాతల సహకారంతో ఆలయంలో ప్రతి శనివారం అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. గౌరవ సలహాదారుగా నల్లబిరుదు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

సాగరమాత ఆలయంలో

ప్రత్యేక ప్రార్థనలు

మాచర్లరూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గల సాగర మాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ భక్తులకు దైవ సందేశం అందించారు. అనంతరం తేరు ప్రదిక్షణ చేపట్టారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

కంటి వైద్యశిబిరానికి

అనూహ్య స్పందన

బెల్లంకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో ఆదివారం శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన రోగులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, సర్పంచ్ జ్యోతి సముద్రం, శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

నాగార్జున కొండపై

పర్యాటకుల సందడి

మాచర్ల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండపై ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో కొండకు చేరుకున్న పర్యాటకులు మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, బుద్ధుని పాలరాతి విగ్రహం, మట్టి కుండలు, బోధివృక్షాన్ని సందర్శించారు. అనుపులోని యాంపీ థియేటర్ అశ్వమేధ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని వీక్షించారు. అనంతరం ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. దీంతో లాంచీ స్టేషన్‌కు రూ. 41 వేల ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.



కొండకు వెళ్తున్న పర్యాటకులు

కాల్వలకు జలకళ

- యుద్ధప్రాతిపదికన కాల్వల మరమ్మతు పనులు
- నేడు చివరి భూములకు సాగు నీరు
- నాడు నిధులు మింగి పనులు చేయని వైసీపీ
- రైతుల భగీరధుడిగా ఎమ్మెల్యే యరపతినేని



ఆకురాజపల్లి మేజరులో కాలువల మరమ్మతు అనంతరం పరిస్థితి

మాచవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాచవరం మండలంలోని ఆకురాజుపల్లి మేజరు సుమారు 25 కిలో మీటర్ల పొడవున విస్తరించి ఉంది. ఈ మేజరు కింద సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ప్రధానంగా పత్తి, మిర్చి, వరి, కంది, పసుపు, మినుము తదితర రకాల పంటలను ప్రతి ఏటా సాగులో ఉంటాయి. గత వైసీపీ ఐదేళ్ల పాలనా కాలంలో మేజరు పరిధిలోని కాలువలు నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో కాల్వల్లో సక్రమంగా నీరు రాక, వచ్చిన నీరు రైతులకు అందక పోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ సమస్యను గమనించిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పల్నాడు ప్రాంతంలోని ఆకురాజుపల్లి, తంగెడ, రామాపురం మేజర్లకు నిధులు మంజూరు కానప్పటికీ మరమ్మతులకు పూనుకున్నారు. ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని, ఎమ్మెల్సీ జంగా కృష్ణ కృష్ణమూర్తిలు ఒకే రోజు ఆయా మేజర్లకు శంకుస్థాపనలు చేసి ఆయా గ్రామాల రైతుల చేతనే కాలువల మరమ్మతుల పనులు చేయిస్తున్నారు. దీంతో ఆయా మేజర్ల గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిట్ట చివరి భూముల రైతులతే ఇలాంటి పరిస్థితి ముందెన్నడూ చూడలేదని ఆశాభావం వక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మేజర్ల బాగు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ తూతూమంత్రంగా పనులు చేసి నేతలు బిల్లులు చేయించుకొని జేబులు నింపుకున్నారని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.

గత ఐదేళ్ల వైసీపీ పాలన కాలంలో ఎన్ఎస్‌పీ కాలువలు అధ్వానంగా ఉండేవి. కంప చెట్లతో, పిచ్చి మొక్కలతో, ఆకులతో అలముకొని పోయి ఉండేవి. పర్యవసానంగా మొదటి భూములకు కూడా సాగు నీరు అందని పరిస్థితి. నేడు కూటమి పాలనలో కాలువల పరిస్థితి మారిపోయింది. శరవేగంగా మరమ్మతు పనులను మొదలు పెట్టి పూర్తిచేశారు. దీంతో నేడు చివరి భూములకు కూడా సాగు నీరు సజావుగా అందుతోంది. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతోనే ఇది సాధ్యమైందని, ఆయన తమ పాలిట భగీరధుడని ఆయా ప్రాంతాల రైతులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

ఎమ్మెల్యే యరపతినేనికే సాధ్యమైంది : పలిశెట్టి వెంకటేశ్వర్లు



ఆకురాజుపల్లి మేజరులో కాలువల మరమ్మతుల పనులు చేపట్టడం ఎమ్మెల్యే యరపతినేనికే సాధ్యమైంది. గత ప్రభుత్వంలో నేతలు నిధులు దిగమింగితే, నేడు నిధులు లేకున్నా పనులు చేయించడంతోనే చివరి భూములకు సాగునీరు అందుతోంది.

కళకళలాడుతున్న కాలువలు : పీ. రామయ్య, మాజీ డీసీ చైర్మన్




నేడు ఆకురాజుపల్లి మేజరు పరిధిలోని కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. ఇప్పుడు రైతులు రాత్రిబవళ్ళు నీటి కోసం కాలువల మీద పడి గాపులు కాయాల్సిన పని లేదు. కాలువల మరమ్మతులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే యరపతినేనికి కృతజ్ఞతలు.



వైసీపీ హాయాంలో ఆకురాజుపల్లి మేజరులో కంప చెట్లు, ఆకులతో మునిగి నిండి పోయిన దృశ్యం

బుగ్గవాగు ఆధునికీకరణకు కృషి చేస్తాం

- ఆధునీకరించిన తర్వాతనే ప్రజల్లోకెళ్తాం
- ఎమ్మెల్యేలు యరపతినేని, జూలకంటి



బుగ్గవాగు రిజర్వాయర్



ఎమ్మెల్యే యరపతినేని, జూలకంటి

రెంటచింతల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంచికల్లు బుగ్గవాగు రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి రెండు జిల్లాల పరిధిలో తాగు, సాగునీరు అందిం చేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో వుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు తెలిపారు. ఆదివారం గోట్టిముక్కల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుగ్గవాగు ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారం సీఎం చంద్రబాబు వద్ద వుంద న్నారు. 2017 మే 10న అప్పటి కలెక్టర్ కోనా శశిధర్ శ్యామరాజపురం వద్ద బుగ్గవాగు రిజర్వాయర్‌ను పరిశీలించారని, అలాగే 2018జూన్ 23న రూ.220 కోట్ల విడుదలకు ప్రభుత్వం సూత్రపాయంగా అంగీకరిస్తే ఇద్దరు అధికారులు అడ్డుపడ్డారని గుర్తుచేశారు. అయితే శనివారం కలెక్టర్ అరుణబాబు బుగ్గవాగు ఆధునికీకరణపై ప్రకటన చేయడం మంచి విషయమన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 3.463 టీఎం సీలకన్నా ఎక్కువ నీరు నిల్వచేసే అవకాశం లేదని, పూడిక పేరుకుపోవడమే అందుకు కారణమన్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామార్థ్యాన్ని 5 టీఎంసీలకు పెంచేలా డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టునివేదిక) తయారుచేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎమ్మెల్యేలు తెలిపారు.



సాగి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ లావు

సాగి సేవలు చిరస్మరణీయం

● ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు

నకరికల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు తొలి ఎంపీపీ సాగి కోటేశ్వరరావు మృతి ఎంతో బాధాకరమని, టీడీపీకి తీరని లోటని, ఆయన సేవలు చిరస్మరణీయమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. ఆదివారం ఆయన చల్లగుండ్లలో సాగి కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఆయనతోపాటు పార్టీ నేతలు లాం కోటేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు హరీష్, నరసరావుపేట జనసేన ఇన్‌చార్జి సయ్యద్ జిలానీ, గుంటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, స్వర్ణ రామారావు, వెంకటరెడ్డి, వీరాంజనేయులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

బెల్లంకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కారుమూరి సుబ్బారావు గత నెల 28 న ఇంటి నుంచి వెళ్ళి తిరిగిరాని ఘటనపై ఆయన పెద కుమా రుడు శ్రీహరి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు బెల్లంకొండ ఎస్ఐ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటినుంచి వెళ్లిన సుబ్బారావుని నాలుగు రోజులుగా బంధువులు వెతుకుతున్నా ఆచూకీ కాన రాలేదని శ్రీహరి ఆఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

అచ్చంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని ఆంజనేయుని విగ్రహం సెంటర్ వద్ద ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం తెలిపారు. క్లస్టర్ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి మొక్కపాటి గిరిబాబు, ఎనిగండ్ల కోటయ్య, చెరుకుంపాలెం సర్పంచ్ పోట్ల శ్రీనివాసరావు, శివకృష్ణ, కోటేశ్వరరావు, మాబూవలి, వీరాంజనేయులు, నల్లగట్ల సత్యం, బొడెల సాంబిరెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత

రెంటచింతల,నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాలువాయి గ్రామానికి చెందిన యరమాసు లింగయ్యకు మంజూరైన రూ.35,524 సీఎం సహాయనిధి చెక్కును సర్పంచ్ మండలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి ఆదివారం లింగయ్యకు అందజేవారు. లింగయ్య భార్య లక్ష్మమ్మ కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందింది. కార్యక్రమంలో మండలపు హనిమిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ టికోటిరెడ్డి, పాశం రామకోటిరెడ్డి, దేరంగుల చిన్నోడు, కొంగర సాంబయ్య పాల్గొన్నారు.

క్రీడా పోటీల నిర్వహణకు

టీడీపీ నేత ఆర్థికసాయం

కారంపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పంగులూరి పుల్లయ్య ఆదివారం రూ. లక్ష ఆర్థిక సాయం అందించినట్లు హైస్కూల్ విద్యాకమిటి చైర్మన్ బాలునాయక్ తెలిపారు. క్రీడల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతులు, భోజన సదుపాయాలు కల్పించాలని పుల్లయ్య కోరినట్లు తెలిపారు.

సమన్వయ కమిటి ఏర్పాటు చేస్తాం

రెంటచింతల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేణుల మధ్య ఐక్యత కోసం మండల స్థాయిలో సమన్వయ కమిటిని ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మండల నేతలతో మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో అందరూ సమన్వయంతో వ్యవహరించడం వలనే భారీ మెజార్టీ రావడంతో పాటు ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. ఒక గ్రామం వ్యవహారంలో మరొకరు జోక్యం చేసుకోవద్దని, అధికారుల వద్ద తన పేరు చెప్పి లబ్ధిపొందొద్దని పార్టీ శ్రేణులకు సూచించారు.



రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

రామప్ప దేవాలయంలో

ఎమ్మెల్యే జూలకంటి పూజలు

మాచర్లటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామప్ప దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతలపూడి రామలింగేశ్వరస్వామి (శివలింగం)కి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కజ్జం సైదయ్య, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కంభంపాటి అనిల్‌కుమార్, తుమ్మేపల్లి పెద అంకారావు తదితరులు పాల్గొన్నారు.



ఆలపాటితో నూర్‌బాషా సంఘ నాయకులు

ఆలపాటికి నూర్‌బాషాల మద్దతు

అమరావతి, నవంబరు 3: ఉమ్మడి గుంటూరు, కృష్ణా పట్టభద్రుల ఎమ్మెల్సీఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాంజేంద్రప్రసాద్‌కు మండల నూర్‌బాషా సంఘం నేతలు సంపూర్ణమద్దతు ప్రకటించారు. ఆదివారం గుంటూరులోని ఆలపాటి కార్యాలయంలో రాజేంద్రప్రసాద్‌ను కలసి తమ మద్దతు తెలియజేశారు. వీరితో పాటు టీడీపీ యువ నాయకులు చమన్‌సాహెబ్ కుమారుడు ఉమ్మర్‌ముక్తార్ పాల్గొని నూర్‌భాషాలలో అర్హతగల్గిన పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నూర్‌బాషా రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శి ఖాసిం సైదా, నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు షేక్ ఖాన్‌సాహెబ్, టీడీపీ నేతలు అల్లాభక్షు, ఖాశిం, నాగులు, ఇమాంసా, రహిం, నబీ పాల్గొన్నారు.

గుంతలు లేని రోడ్లు ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

గురజాలటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గుంతలు లేని రోడ్లు కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మిషన్ పాట్ హోల్‌ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను ఆయన పూడ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో రహదారులన్నీ గుంతలమయంగా మారాయన్నారు. రహదారులను అభివృద్ధి చేసేందుకు సీఎంచంద్రబాబు నిధులను విడుదల చేస్తున్నారన్నారు. ఐదేళ్లలో విజన్ ఉన్న సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. గురజాల నియోజకవర్గంలో రూ.1.50కోట్లతోరహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు. త్వరలోనే గుంతలు లేని రహదారులను చూస్తారన్నారు. అనంతరంవివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే యరపతినేని పాల్గొన్నారు. గొట్టిముక్కలలో మరణించిన టీడీపీ సీనియర్‌నేత రావిపాటి అప్పారావు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.



తారుతో గుంతను పూడుస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

మెప్మా స్టాల్స్ సందర్శన..

పట్టణంలో మెప్మా ఆధ్వర్యాన పొదుపు సంఘాల మహిళలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ఆదివారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సందర్శించారు. జండూబామ్, పచ్చళ్లు, సుండుండలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విసిరిన చలోక్తులు అక్కడవున్న వారిని కడుపుబ్బా నవ్వించాయి.

అప్పులబాధతో

కౌలురైతు ఆత్మహత్య

అచ్చంపేట, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలో గల గింజుపల్లి తండాలో కౌలురైతు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గింజుపల్లి తండాలో నివశించే కౌలు రైతు బాణావత్ హనుమాన్‌నాయక్ (40) తనకు గల సొంత పొలం 75 సెంట్లుతో పాటు ప్రతి ఏటా మూడు ఎకరాలను కౌలుకి తీసుకొని సాగు చేస్తుంటాడు. సాగు పెట్టుబడి కోసం ప్రతి ఏటా అప్పులు చేశాడు. చేసిన అప్పులకు తోడు వడ్డీ పెరుగుతుండటంతో సుమారు రూ.15 లక్షలకు పైగా బాకీపడ్డాడు. ఈ అప్పులను తీర్చలేమోనన్న మనస్థాపంతో హనుమాన్‌నాయక్ ఆదివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని బంధువులు తెలిపారు. హనుమాన్‌నాయక్‌కు భార్య శాంతిబాయి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రతి విద్యార్థికి అపార్ కార్డు

● ఎనుముల శివ నాగేశ్వరరావు
ఎంఈవో 2, రెంటచింతల

ఫటా ఫట్



శివ నాగేశ్వరరావు
ఎంఈవో 2

రెంటచింతల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యా విధానంలో కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసుకువస్తుంది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ గుర్తింపు పేరిట 12 అంకెలతో ప్రతి విద్యార్థికి అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమి అకౌంట్ రిజిస్ట్రీ) కార్డును కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఆపార్ కార్డు గురించి రెంటచింతల ఎంఈవో 2 ఎనుముల శివనాగేశ్వరరావుతో ఆదివారం ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఫటాఫట్..

ప్ర: అపార్‌తో ఎవరెవరికి ప్రయోజనం ?

జ: విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఎంతో ప్రయోజనం. 1వ తరగతి నుంచి 10వ తరగతి చదివే బాల బాలికలకు పుట్టిన తేదీతో పాటు ఇతర వివరాలను నమోదు చేసే ప్రక్రియ ఆపార్‌తో ప్రారంభమైంది.

ప్ర: మండలంలో ఎంత మంది విద్యార్థులకు ప్రయోజనం?

జ : మండలంలో 23 ప్రాథమిక పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, తొమ్మిది ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదివే 3764 మంది విద్యార్థులకు ఆపార్ గుర్తింపు కార్డులు ఇస్తాం.

ప్ర: ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎన్ని?

జ: 12 వరకు వున్నాయి. అయినప్పటికి విద్యార్థులకు బోదనాపరమైన ఏ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వున్నాయి?

జ: 85 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా, 17 పోస్టులు ఖాళీగా వున్నాయి. పోస్టుల భర్తీ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు తెలియపరిచాం.

ప్ర: మధ్యాహ్న భోజనం పథకం ఎలా అమలౌతోంది.

జ : మెనూని క్రమం తప్పకుండా అమలు చేస్తున్నాం. తరుచూ పాఠశాలలు తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకం అమలుపై అభిప్రాయాలను సేకరిస్తున్నాం.

లోకేశ్ అమెరికా పర్యటన విజయవంతం

- రాష్ట్రంలో పెట్టుబడులే లక్ష్యంగా పలు కంపెనీలతో చర్చలు
- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వెల్లడి.. ఎయిర్‌పోర్టులో లోకేశ్‌కు స్వాగతం



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఏపీలో పెట్టుబడులే లక్ష్యంగాసాగిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అమెరికాపర్యటన విజయవంతమైందని ఎమ్మెల్యే భాష్యంప్రవీణ్ తెలిపారు.ఆదివారం ఆయన హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వదేశానికి విచ్చేసిన లోకేశ్‌ను కలసి బొకే అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ లోకేశ్ పర్యటనలో భాగంగా పలు కంపెనీల ప్రతినిధులను కలిసి ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారని తెలిపారు. గత వైసీపీప్రభుత్వ విధ్వంసక విధానాలతో దారితప్పిన ఏపీ పారిశ్రామికరంగాన్ని గాడిన పెట్టేందుకు మంత్రి లోకేశ్ చేస్తున్న కృషి ఎంతో ఆశాజనకంగా ఉందని, రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్యే ప్రవీణ్ అన్నారు.



మల్లేశ్వర స్వామి ఆలయంలో టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి

వెంకటేశ్వరునికి సేవ చేయటం నా అదృష్టం

● టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి

నకరికల్లు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్షదైవం వెంకటేశ్వరస్వామికి సేవచేసే అదృష్టం కలగటం తన పూర్వజన్మ సుకృతమని టీటీడీ పాలక మండలి సభ్యుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం ఆయన నకరికల్లులోని భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి, చల్లగుండ్లలోని లక్ష్మీతిరుపతమ్మ తల్లి సమేత గోపయ్యస్వామి దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం జంగా మాట్లాడుతూ టీటీడీ పాలక మండలి సభ్యుడిగా మూడవసారి తనను ఎన్నిక చేసిన కూటమి ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తిరుమల పవిత్రను కాపాడేవిధంగా కృషి చేస్తానన్నారు. ఆయనతోపాటు జడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, జే.వీరాంజనేయులు, కోటేశ్వరరావు, పూర్ణచంద్రర రావు, శ్రీనివాసరావు, శివ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.




కృష్ణానదిలో స్నానమాచరిస్తున్న భక్తులు

కృష్ణానదిలో భక్తుల కార్తీక స్నానాలు

అమరావతి, నవంబరు 3: కార్తీకమాసం తొలి ఆదివారం పంచారామ క్షేత్రాల్లో ప్రసిద్ధమైన అమరేశ్వరాలయాన్ని ఆదివారం భక్తులు సందర్శించారు. ముందుగా పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించారు. అనంతరం స్వామివార్లను దర్శించుకుని మిగిలిన క్షేత్రాలకు తరలి వెళ్లారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలలో తరలివచ్చిన భక్తులు అమరావతి చేరుకుని దీపారాధనలు చేసి స్వామివారిని దర్శించుకుని వెళ్లారు.

కాశీ విశ్వేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

నకరికల్లు,(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మొదటి ఆదివారం పురస్కరించుకొని నరసింగపాడులోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. అర్చక స్వాములు కాశీవిశ్వేశ్వరునికి విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల్లో కొమ్మ వరపు పవన్ కుమార్ శర్మ, కేవీఎస్ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



రజక కార్తీకమాస వనసమారాధన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

కార్తీక వనసమారాధన

సామాజిక ఐక్యతను పెంచుతుంది

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన కార్తీకమాసంలో సామాజిక వనసమారాధన కార్యక్రమాలు ఆయా సామాజికవర్గాలలో ఐక్యతను, చైతన్యాన్ని పెంచుతాయని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం దేవరంపాడు కొండవద్ద రజక సామాజికవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రజక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గుర్రపుశాల రామకృష్ణ, అఖిలభారత దోబీ సంఘ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, అక్కినపల్లి బాలయ్య, నిడుబ్రోలు వెంకట్రామయ్య, విప్పర్ల నరసింహారావు, మక్కెన రాజు, నాసరయ్యతో పాటు పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు. తొలుత పట్టణంలోని జానపాడు రోడ్డులో విశ్వమంగళ పాలీమర్స్ పరిశ్రమను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, శ్రీను, పిల్లి చెన్నారావు, జూలకంటి సుబ్రహ్మణ్యం, సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటుహక్కు అర్హతపై ఈసీ స్పష్టత

- 10, ఇంటర్ సర్టిఫికెట్లతో సంబంధం లేదు
- జీవో నెంబరు. 536లో పేర్కొన్న యూనివర్సిటీల్లో దేని నుంచైనా డిగ్రీ చాలు
- బీఎల్‌వోలు ఏ ఒక్క దరఖాస్తుదారుడిని ఆఫీసుకు పిలిపించుకోరాదు
- సీఈవో వివేక్‌యాదవ్ ఆదేశాలు

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నిక నిమిత్తం ఓటుహక్కు పొందేందుకు కొన్ని సందేహాలను ఈసీ నివృత్తి చేస్తూ స్పష్టతనిచ్చింది. మరో మూడు రోజుల్లో ఓటరుగా నమోదయ్యేందుకు గడువు ఉన్న నేపథ్యంలో తన దృష్టికి వచ్చిన కొన్ని అంశాలపై రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ వివరణ ఇచ్చారు. కొంతమంది బీఎల్‌వోలు/వీఆర్‌వోలు ఫారం-18లో ఫైల్ చేసిన ఒరిజినల్ సర్టిఫికేట్లకు బదులుగా అటెస్టెడ్ కాపీలు ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్స్‌కి కూడా అటెస్టు చేసిన కాపీలను జతపరిచిన హార్డ్ కాపీని ఇవ్వమని కోరుతున్నారు. కొందరైతే 10, ఇంటర్, డిగ్రీ సర్టిఫికేట్లు చూపించమంటున్నారు. 10+2-3 సిస్టమ్‌లో పాస్ అయ్యారా, లేదా అని ప్రశ్నిస్తున్నారు. క్రాస్ చెక్ కోసం సర్టిఫికేట్లను తీసుకొని వార్డు సచివాలయాలకు రమ్మంటున్నారు. ఇవన్నీ కరెక్టు కాదని సీఈవో స్పష్టం చేశారు.

ఆన్‌లైన్‌లో దాఖలైన ఫారం-18కు సంబంధించి బీఎల్‌వోలు సంబంధిత దరఖాస్తుదారుని నివాసానికి వెళ్లి ఒరిజినల్ సర్టిఫికేట్‌ని పరిశీలించాలి. సరిగా ఉంటే కరెక్టుగా ఉందని పేర్కొనాలి. లేకుంటే తిరస్కరిస్తున్నట్లు సంతకం తీసుకోవాలన్నారు. ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొన్న వ్యక్తి డిగ్రీ పట్టభద్రుడైతే చాలు. 10, ఇంటర్ సర్టిఫికెట్లు అవసరం లేదన్నారు. సరైన ఎంక్వయిరీ చేయకుండా అప్లికేషన్‌ని ఆమోదించడం, తిరస్కరించడం చేయరాదని స్పష్టం చేశారు. బీఎల్‌వోలు ప్రతీ ఒక్క దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి డాక్యుమెంట్లను సేకరించాలి. అంతే తప్పా దరఖాస్తుదారుడిని పరిశీలన నిమిత్తం తన కార్యాలయానికి రావాలని ఆదేశించరాదన్నారు. ఒకవేళ దరఖాస్తుదారుడి ఇంటికి పలుమార్లు వెళ్లినా అందుబాటులో లేకపోతే నోటీసు జారీ చేయాలన్నారు. 2006వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబరు. 536లో ఏ విశ్వవిద్యాలయాల డిగ్రీలను అర్హతగా పరిగణించ వచ్చో స్పష్టంగా పేర్కొనడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు ఆ జీవోని క్షుణ్ణంగా పరిశీలించి దానిని ప్రామాణికంగా తీసుకోవాలన్నారు.

1.35 లక్షలకు పైగా దరఖాస్తులు

ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి అక్టోబరు 30వ తేదీ(గత బుధవారం) వరకు అందిన దరఖాస్తుల వివరాలను ఈసీ విడుదల చేసింది. దాని ప్రకారం ఏలూరులో 4910, కృష్ణా జిల్లాలో 22859, ఎన్‌టీఆర్ జిల్లాలో 25868, గుంటూరు జిల్లాలో 47668, బాపట్ల జిల్లాలో 9899, పల్నాడు జిల్లాలో 23700 దరఖాస్తులు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో వచ్చాయి. ఇప్పటికే 1.35 లక్షలకు పైగా దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

నల్లమలలో ఇనుప యుగ ఆనవాళ్లు

పల్నాట నల్లమల అటవీ ప్రాంతంలో కృష్ణా నది ఒడ్డున ఇనుప యుగపు ఆనవాళ్లు వెలుగు చూశాయి. వాటిలో నిలువురాళ్లు, బండల గుట్టలు ఉండడం విశేషం. క్రీస్తు పూర్వం 3000 ఏళ్ల నాటి ఆదిమానవుడు జీవనానికి సంబంధించిన చరిత్ర ఇక్కడి కట్టడాలు, సమాధుల రూపంలో నిక్షిప్తమై ఉంది. అడవుల్లో ఉన్న ఈ రాళ్లను సమీప గ్రామాల్లోని ప్రజలు 'రాక్షస బండలు' అని పిలుస్తుంటారు. వాస్తవానికి వాటిని 'మెన్‌హిర్స్' అని అంటారు. దేశంలోనే కాదు ప్రపంచంలో ఆదిమానవుని నాగరికత వెలసిల్లిన ప్రతిచోటా ఇలాంటి మెన్‌హిర్స్ బయటపడుతూనే ఉన్నాయి. పల్నాడులో ఉన్నట్టుగా ఇంత పెద్ద ఎత్తున ప్రాచీన కాలపు సమాధులు మరెక్కడా లేవు.



సమాధి చుట్టూ రాళ్లగుట్ట

మాచర్లటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గంగలకుంటకి నైరుతి దిక్కున కృష్ణానది కుడి గట్టుపైన ఉన్న ముగ్గు దిన్నెకాలువ పక్కన నల్లమల అటవీ ప్రాంతంలో దాదాపు పది కిలోమీటర్ల పరిధిలో ఇనుప యుగపు స్మారక కట్టడాలు ఉన్నాయి. కొత్తపుల్లారెడ్డిగూడెంతోపాటు మాచర్ల మండలం అచ్చమ్మకుంట పరిసర ప్రాంతాల్లోనూ ఇళ్ల మాదిరి నిర్మించిన సమాధులు ఉన్నాయి. వాటి నిర్మాణం కూడా భిన్నంగా ఉంది. 5 నుంచి 10 మీటర్ల వ్యాసార్థంతో 2 మీటర్ల ఎత్తులో పెద్ద నాపరాళ్లను నలువైపులా స్వస్తిక్ ఆకారంలో పేర్చి గది మాదిరిగా ఉన్నాయి. గది చుట్టూ పైన గులకరాళ్లతో ఉబ్బెత్తుగా అమర్చి ఉంది. భూమి లోపల కొంత, ఉపరితలంపై కొంత భాగంగా కనపడే విధంగా ఉన్నాయి. ఈ నిర్మాణానికి ఉత్తరాన 10 నుంచి 25 అడుగుల ఎత్తు, 3 నుంచి 5 అడుగుల వెడల్పు, 6 అంగుళాల మందంతో నిలువురాళ్లు ఏర్పాటు చేసి ఉన్నాయి. చనిపోయిన వారికి గుర్తుగా ఇలా పెద్ద శిలలను నిలబెట్టారు. నిలువు రాళ్లపై కొన్ని చోట్ల మనిషి ఆకృతితో పాటు ఎద్దు, ముగ్గు బొమ్మలు కూడా ఉన్నాయి. గూడు సమాధులు (సిస్ట్ బరియల్స్)తోపాటు సామూహిక సమాధులు (డాల్మెన్‌లు-నాలుగైదు మృతదేహాలను కలిపి) ఉన్నట్లుగా భావించవచ్చు. నదీ తీరంలో సమాధులన్నింటికీ దక్షిణ ముఖ ద్వారం నిర్మించడం గమనించాల్సిన అంశం. మృతదేహాన్ని ఖననం చేసి దాని చుట్టూ సమాధి, ప్రహరీ ఏర్పాటు చేసి ఉంది. దేశంలో అనేక చోట్ల ఇలాంటి నిలువు రాళ్లు ఉన్నప్పటికీ అతి పొడవైన దాదాపుగా 20 అడుగుల ఎత్తుగల నిలువురాళ్లు ఇక్కడ పదుల సంఖ్యలో ఉండడం చారిత్రకంగా పల్నాటి ప్రాంత విశిష్టత గుర్తు చేస్తుంది.

▸ రాక్షస గూళ్లు, నిలువురాళ్లు (మెన్‌హిర్స్) ▸ కృష్ణానది తీరంలో పదుల సంఖ్యలో...






గంగలకుంట సమీపంలో నిలువురాళ్లు

రాక్షస బండలు అనడానికి కారణం..

ఈ సమాధులు పెద్ద బండరాళ్లతో ఉండడం, ఇక్కడ లభించే మట్టి పాత్రలు, అస్తి పంజరాలను చూసి ఇవి సామాన్య మానవుడివి కావని గుర్తించడంతో వీటిని రాక్షస గుండ్లు, రాక్షస బండలు అని స్థానికులు పిలుస్తుంటారు. రాతి యుగంలో మానవుడు మృతదేహాలను ప్రకృతికే వదిలేసే వారు. నవీనయుగానికి వచ్చే సరికి మృతదేహాన్ని క్రమపద్ధతిలో పాతిపెట్టడం జరిగింది. బృహత్ రాతి యుగంలో మానవ మృతదేహాన్ని జంతువులు తినకుండా, సామగ్రిని పాడు చేయకుండా పెద్ద రాళ్లతో సమాధులు నిర్మించారు. మృతదేహంతోపాటు మృతులు ఉపయోగించిన వ్యవసాయ సామగ్రి, మట్టి పాత్రలను కూడా సమాధి చేసే వారు. ఈ సమాధుల చుట్టూ బండరాళ్లను పేర్చేవారు. వీటి ఆనవాళ్లు దేశమంతా ఉన్నాయి. కానీ, ప్రహరీలతో వాస్తుపరంగా ఇళ్ల మాదిరి సమాధులు ఉండడం పల్నాడు ప్రాంతంలోనే కనిపిస్తోంది. చరిత్రకు సాక్ష్యలైన ఆనాటి ఆనవాళ్ల (మెన్‌హిర్స్)ను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉంది. ఒకప్పుడు కృష్ణా తీరం వెంట సుమారు 300కు పైగా ఇలాంటి నిలువురాళ్లు ఉండేవని, కాలక్రమంలో ధ్వంసమైపోయి కేవలం పదుల సంఖ్యలో మాత్రమే కనిపిస్తున్నాయి. మానవ చరిత్రకు ఆధారమైన, వారసత్వ కట్టడాలు, రాజులు, రాజ్యాల గుర్తులే కాకుండా ఆది మానవుల పురాతన చరిత్ర ఆనవాళ్లు కూడా భాగమన్న విషయాన్ని ప్రజలు అవగాహన కలిగి ఉండాలి.

వారసత్వ సంపదను కాపాడాలి | పురావస్తు శాఖకు ప్రజల విజ్ఞప్తి

ఇనుము వాడకం మొదలుపెట్టిన కాలాన్ని ఇనుప యుగమని చరిత్ర చెబుతోంది. క్రీస్తు పూర్వం 1000 నుంచి ఇనుప యుగంగా పేర్కొంటారు. నాటి మానవుల జీవనం ప్రధానంగా సేద్యంపై ఆధారపడి ఉండేది. నాటి సమాధుల నిర్మాణ శైలిని పరిశీలిస్తే వారు పక్కాగా వాస్తును పాటించే వారని అర్థమవుతుంది. అయితే, 1000 బీసీ నాటికి మన దేశంలో డబ్బు వినిమయం మొదలు కాలేదని తెలుస్తోంది. కేవలం వస్తు మార్పిడి ద్వారానే వారు వ్యాపారం చేసే వారని అర్థమవుతోంది. ఇనుప యుగపు ఆనవాళ్లు మన రాష్ట్రంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో గతంలో బయటపడ్డాయి. కానీ, ఇంత పెద్ద స్థాయిలో మెన్‌హిర్‌లు పల్నాడు జిల్లాలోనే ఉన్నాయి. మాచర్ల, వెల్దుర్తి మండలాల్లో కృష్ణా తీరం వెంబడి అటవీ ప్రాంతంలో ఉన్న రాక్షస బండలు ఇనుప యుగపు మెగాలితిక్ కల్చర్‌కి ప్రతీకగా చెప్పవచ్చు. నాగరికత విలసిల్లిన ప్రపంచమంతటా మెన్‌హిర్‌లు ఉన్నా వాస్తుశైలితో ఇంత పెద్ద నిర్మాణాలు మాత్రం పల్నాడు కృష్ణా తీరంలోనే ఉండడం విశేషం. పురావస్తు శాఖ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి వారసత్వ సంపదగా గుర్తించి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



అచ్చమ్మకుంట వద్ద రాక్షసగూళ్లు, సమాధులు

అనుమతులు లేకుండా.. అట్టహాసంగా..

చేనేత భవన్ నిర్మాణం

అయిదుకోట్ల రూపాయల ప్రజాధనం వృధా!

ఈ పాపానికి బాధ్యులెవరు?

మంగళగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అయిదు కోట్ల రూపాయలకు పైగా ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన భవన సముదాయం ఎనిమిది నెలలుగా నిరర్థకంగా మిగిలింది. మంగళగిరిలో చేనేత వస్త్ర వ్యాపారుల ప్రయోజనార్థం ఈ భవనాన్ని మంగళగిరి-తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ సాధారణ నిధులతో అట్టహాసంగా నిర్మించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి ప్రజాప్రతినిధుల ఆదేశాల ప్రకారం నిబంధనలను తోసిరాజని అధికారులు ఈ భవనాన్ని ఆగమేఘాల మీద నిర్మించారు. ఆ వెంటనే రాజ్యసభసభ్యుడు, నాటి వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డిని పిలిపించి బ్రహ్మాండంగా భవన ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. అసలీ భవనాన్ని ఎందుకు నిర్మించారో కూడ నాటి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పదేపదే చెప్పుకొచ్చారు. మంగళగిరి నగరం నుంచి మిద్దెసెంటర్ మీదుగా జాతీయరహదారిని చేరుకునే ప్రధాన రోడ్డు మార్గంలో పలు చేనేత వస్త్ర దుకాణాలు రోడ్డును ఆక్రమించి వుండడంతోపాటు... సదరు వస్త్ర దుకాణాలకు వచ్చిపోయే కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్‌తో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రస్థాయిలో తలెత్తుతున్నాయి. ఈ ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించాలంటే సదరు తెనాలి రోడ్డును విస్తరించాలని...ఇందుకు అవరోధంగా వున్న దుకాణాల తాలూకు ఆక్రమణలను తొలగించాలని అప్పట్లో ప్రతిపాదించారు. ఈ క్రమంలో చేనేత వస్త్ర వ్యాపారులకు నష్టం జరుగకుండా చూడాలన్న ఉద్దేశంతో ఆ షాపులన్నింటిని ఒకేచోటకు తరలించాలన్న ఆలోచనతో ఎంటీఎంసీ ఆధ్వర్యంలో భారీ చేనేతవస్త్ర దుకాణ సముదాయం కోసం ఈ భవనాన్ని అయిదుకోట్ల రూపాయలకు పైగా సాధారణ నిధులతో నిర్మించేశారు. నిర్మాణపనులు పూర్తవ్వడమే ఆలస్యమన్నట్టుగా ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫిబ్రవరి 12వ తేదీన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిపించేశారు. ఇంతవరకు బాగానే వుంది. కానీ ఏ ఉద్దేశంతో నైతే ఈ చేనేత భవన్‌ను నిర్మించారో...ఆ ఉద్దేశాన్ని నెరవేర్చకుండా ఆ భవనాన్ని నిరర్థకంగా వదిలేసి కూర్చొన్నారు.

నిజానికి చేనేత భవన్ నిర్మాణం చట్టబద్ధంగా జరుగలేదు. ఈ భవననిర్మాణంలో ఎన్నో రకాల నిబంధనలను తుంగలో తొక్కారు. ఆ నిబంధనల ఉల్లంఘనే నేడు చేనేత వ్యాపారులకు షాపులను బదలాయించేందుకు వీలులేకుండా అడ్డుపడుతున్నాయని ఎంటీఎంసీ అధికారులు చెబుతున్నారు. ఆ నిబంధనల ఉల్లంఘన విషాయానికొస్తే...అసలు చేనేత భవన్ నిర్మాణానికి ఉద్దేశించిన సుమారు 40 సెంట్ల స్థలం ఎంటీఎంసీకి చెందినది కాదు. అది పక్కా గుంటూరు జిల్లా పరిషత్‌కు చెందినది. గతంలో జిల్లా పరిషత్ వారు ఆ స్థలాన్ని ప్రజాప్రయోజనార్థం ఆర్టీసి బస్టాండు కోసం ఇచ్చారు. మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో కొత్త బస్టాండును 1987లో ఆర్టీసి నిర్మించుకున్నాక బస్టాండును ఇక్కడి నుంచి అక్కడికి తరలించారు. అయినప్పటికీ ఆ స్థలాన్ని ఆర్టీసి సంస్థ జిల్లా పరిషత్‌కు అప్పగించకుండా తన స్వాధీనంలో వుంచుకుంది. దీనిపై జిల్లా పరిషత్ కోర్టులలో పోరాడి సదరు స్థలంపై తన యాజమాన్యపు హక్కులను రుజువు చేసుకుని తన స్వాధీనంలోకి తీసుకుంది. సరిగ్గా ఇదే సమయంలో నగరంలో తెనాలి రోడ్డులో ట్రాఫిక్ సమస్య తెగని సమస్యగా అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తెనాలి రోడ్డును విస్తరించి సమస్యను పరిష్కరిస్తామని హామీలను ఇచ్చి ఆ రోడ్డులో వున్న చేనేత దుకాణదారుల కోసమని చేనేత భవన్‌ను నిర్మించి షాపులను అద్దె ప్రాతిపదికన ఇస్తామని ప్రకటించారు.



మంగళగిరిలో నిరర్థకంగా వున్న చేనేత భవన్

ఈ క్రమంలో నగరంలో ప్రభుత్వ ఖాళీస్థలాలను గుర్తించే క్రమంలో జిల్లా పరిషత్ అధికారులు ఈ స్థలం పరిశీలనకు వచ్చారు. ఈ స్థలంలో 40 షాపులతో కూడిన అయిదంతస్తుల భవనాన్ని నిర్మించాలని ప్రతిపాదించారు. దీనిని జడ్పీ ఆధ్వర్యంలో నిర్మించి జిల్లా పరిషత్ యాజమాన్య ఆస్తిగా మంగళగిరిలోని చేనేత వస్త్ర వ్యాపారులకు అద్దెల కింద ఇచ్చినట్టయితే అంతా సవ్యంగా సాగిపోయేది. కానీ అందుకు భిన్నంగా వ్యూహరచన చేశారు. జిల్లా పరిషత్ నుంచి ఎంటీఎంసీకి కొద్ది సంవత్సరాల పాటు స్థలాన్ని లీజుకు తీసుకుని రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక నిధులతో భవన నిర్మాణం చేయాలని ప్లాన్ చేశారు. దీనికి సంబంధించి చాలా వేగంగా దస్త్రాలను మునిసిపల్ పరిపాలన శాఖకు నివేదించారు. అయితే స్థలంపై ఎంటీఎంసీకి పూర్తి యాజమాన్యపు హక్కులు లేనందున గ్రాంటును మంజూరు చేయడం సాధ్యం కాదని నాటి పురపాలనశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి స్పష్టం చేస్తూ ఎంటీఎంసీకి తాఖీదులను పంపించారు. దీంతో భవన నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చును ఎంటీఎంసీ సాధారణ నిధుల నుంచి వెచ్చించేలా ఆళ్ల రామకృష్ణారెడ్డి అధికారులపై ఒత్తిడి తేవడంతో వారు గత్యంతరం లేక సాధారణ ఖాతా నుంచి అయిదు కోట్ల రూపాయలకు పైగా నిధులను వెచ్చించేందుకు ఆమోదముద్ర వేశారు. దీంతో అంతపెద్ద భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకుండానే ఎడాపెడా నిర్మాణం చేశారు.

నగరంలో ఎవరైనా అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేస్తే నానా యాగీ చేసే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈ భవన నిర్మాణ విషయంలో చేష్టలుడిగి మిన్నకుండిపోయారు. యాజమాన్య హక్కులు లేకుండా మునిసిపల్ సాధారణ నిధులను రూపాయి కూడా ఖర్చు చేయరాదన్న నిబంధనను అధికారులందరూ తుంగలో తొక్కారు. పైగా జిల్లా పరిషత్ వారి లీజు అగ్రిమెంటులో సదరు స్థలంలో తాత్కాలిక నిర్మాణాలను మాత్రమే చేపట్టాలన్న నిబంధనను కూడ పూర్తిగా ఉల్లంఘించి అక్కడ భారీ అయిదంతస్తుల భవనాన్ని నిర్మించారు. దీనిపై ఏ పౌరుడైనా కోర్టును ఆశ్రయిస్తే...నిబంధలనకు విరుద్ధంగా నిర్మించిన ఈ భవనాన్ని తక్షణమే కూల్చివేయాలన్న ఆదేశాలు వెలువడే అవకాశం లేకపోలేదు. దీంతో అధికారులు ఇప్పుడీ భవనాన్ని ఏం చేయాలో తెలియక సందిగ్ధావస్థలో పడిపోయారు.

వచ్చిన ఉద్యోగం కాదని... నచ్చిన ఉద్యోగం సంపాదించి

జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ సక్సెస్ స్టోరీ



గుంటూరు సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కృషితో నాస్తి దుర్భిక్షం అని పెద్దలంటారు. కృషి,పట్టుదల ఉంటే ఎంతటి క్లిష్టమైన పరిస్థితి లో నైనా అనుకున్నది సాధించవచ్చు. అటువంటి కోవకు చెందిన వారే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ప్రస్తుత డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ. పేదరికం పై ఆయన పోరాడారు. ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యం వైపే సాగారు. వచ్చిన ఉద్యోగాలతో సరిపెట్టుకోలేదు. గ్రూపు-1 పోస్టు సాధించే వరకు విశ్రమించలేదు.

తండ్రి తాపీ మేస్త్రి...

కృష్ణ సొంత గ్రామం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కనుమళ్ల. చాలా వెనుకబడిన ప్రాంతం. తల్లి తండ్రులు నిరుపేద కూలీలు. తండ్రి చిన వెంకయ్య తాపీ మేస్త్రి.తల్లి చిన్నమ్మ సాధారణ వ్యవసాయ కూలీ.మొత్తం నలుగురు పిల్లలు. 10వ తరగతి వరకు సింగరాయకొండ పాఠశాలలో నే చదువుకున్నారు.డిగ్రి కందుకూరులో పూర్తి చేశారు. ఆ తర్వాత ఉపాధి కోసం అని తండ్రి తెలంగాణ కు వెళ్లిపోవడం తో పీజీ వరంగల్ లో చదవాల్సి వచ్చింది. పీ ఎహెచ్ డీ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు.

రెండు సార్లు ఎస్ ఐ ఉద్యోగం..

కృష్ణకి మొదట 1995 లో ఏపీఎస్‌పీలో ఎస్ఐ ఉద్యోగం వచ్చింది. 1998 లో సివిల్ ఎస్ఐ గా ఎంపికయ్యారు. ఎస్ఐ గా వరంగల్ జిల్లా లోని మరిపెడ్ బంగ్లా, నర్సింహులపేట,దంతాల పల్లెలో ,హైదరాబాద్ నగరం లోని గోల్కొండ, శాలిబండ లో పనిచేశారు. మంచి హోదా కలిగిన ఎస్ఐ ఉద్యోగం చేస్తున్నా తెలియని అసంతృప్తి వెంటాడుతూ ఉండేది.పేద ప్రజలకు నేరుగా సహాయం చేయగలిగే ఉద్యోగం సంపాదించాలన్న తపన ఎక్కువగా ఉండేది. ఎస్ ఐ ఉద్యోగం కన్నా మెరుగైన గ్రూపు-1 పోస్టు లో అది సాధ్యపడుతుందని భావించారు. దాంతో 1999 లో గ్రూపు-1 పరీక్ష రాసారు. మొదటి ప్రయత్నం విఫలం కావడంతో నిరుత్సాహ పడకుండా 2003 లో మళ్ళీ పరీక్ష రాశారు. అప్పుడు రాసిన పరీక్షల ఫలితాలు 2007 లో విడుదల అయ్యాయి. గ్రూపు-1 తగిన ర్యాంకు రావడం తో ఎంపీడీఓ గా ఎంపికయ్యారు.ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఎంపీడీఓ గా పనిచేశారు. పదోన్నతి మీద విజయనగరం ఫైనాన్స్ మేనేజర్ గా పనిచేశారు.తదుపరి బాపట్ల డీఆర్డీఏ పీడీగా పనిచేశారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ గా వచ్చారు.

పరాజయం ఎదురైనా ప్రయత్నం ఆపలేదు : కృష్ణ, డిప్యూటీ సీఈఓ

ఎస్ఐ ఉద్యోగం చేస్తున్నప్పుడు ఏదో తెలియని వెలితి వెంటాడేది. నా మనసు నువ్వు ఉండాల్సిన స్థానం ఇది కాదని చెప్పేది.చాలా మంది వారించినా ఎస్ఐ ఉద్యోగానికి రాజీనామా చేసి గ్రూపు-1 కి సిద్ధపడ్డా.మొదటి సారి పరాజయం ఎదురైనా మళ్ళీ ప్రయత్నం చేశా అనుకున్నది సాధించా. నేను ఈనాటి యువత కు ఇచ్చే సలహా ఒక్కటే.ఒక్క ప్రయత్నం విఫలం అయితే మరోసారి ప్రయత్నం చేయండి. చదువు లో సక్సెస్ కాకపోతే మరో రంగంలో సక్సెస్ కావచ్చు.

బీచ్ రిసార్ట్స్‌కు.. భలే గిరాకి

- సూర్యలంక తీరంలో హరితా బీచ్ రిసార్ట్స్
- ఏడాది పొడవునా బుకింగ్‌లే
- హైదరాబాద్ వాసులే అత్యధికం



హరితా బీచ్ రిసార్ట్స్ కాటేజీలు

బాపట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :సరదాగా గడిపేందుకో, ఆహ్లాదకర వాతావరణంలో ఉండేందుకో, ప్రకృతి ఒడిలో సేద తీరేందుకో.. ఏదో ఒక పర్యాటక ప్రదేశానికి వెళుతుంటాం. అలాంటి పర్యాటక ప్రదేశాల్లో బాపట్ల జిల్లా కేంద్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం సూర్యలంక సముద్రతీరం కూడా ఒకటి. కుటుంబసభ్యులు, పిల్లలు, స్నేహితులు, కొత్తగా పెళ్లయిన వారు.. ఇలా చాలా మంది ఇక్కడికి వస్తుంటారు. ముఖ్యంగా, వీకెండ్స్‌లో, పర్వదినాల్లో, పుణ్యస్నానాల సమయంలో ఇక్కడికి బాపట్ల వాసులే కాకుండా పలు ప్రాంతాల నుంచి వచ్చే వారు అధికసంఖ్యలోనే ఉంటుంటారు. ఈ సముద్రతీరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సంబంధించిన హరితా బీచ్ రిసార్ట్స్ ఉంది. దీని డిమాండ్ నానాటికి పెరుగుతోంది. ఏడాది పొడవునా ఇక్కడి కాటేజీలు ఆన్ లైన్ బుకింగ్‌లోనే బుక్ అవుతూనే ఉంటాయి. కాటేజీల సంఖ్య తక్కువే అయినా డిమాండ్ మాత్రం చాలా ఎక్కువగా ఉంది. అందులో అత్యధికశాతం హైదరాబాద్ వాసులే ఉన్నారు. అప్పుడప్పుడు మాత్రమే ఆంధ్రప్రాంత పర్యాటకులకు అవకాశం లభిస్తోంది.



ఆధునీకరిస్తున్న ఏసీ స్టాండెడ్ కాటేజీలు

వీకెండ్స్‌లో ఒక ధర.. మిగిలిన రోజుల్లో మరో ధర

హరితాబీచ్ రిసార్ట్స్‌లో 31 ఏసీ కాటేజీలు, రెండు నాన్ ఏసీ కాటేజీలు ఉన్నాయి. వీటిల్లో 10 డీలక్స్ కాటేజీలు కూడా ఉన్నాయి. వీటికి అత్యధిక డిమాండ్ ఉంది. సముద్రానికి ఎదురుగా ఉండే ఈ కాటేజీలకు శుక్ర,శని ఆదివారాలలో రూ.4,480 చొప్పున, ఏసీ స్టాండెడ్ కాటేజీలు 13 ఉండగా వీటికి రూ.3,500 చొప్పున, న్యూస్టాండెడ్ కాటేజీలు 3 ఉండగా వీటికి రూ.3,600 చొప్పున,నాన్ ఏసీ రూమ్‌లకు రూ. 2,240 చొప్పున తీసుకుంటారు. మిగిలిన రోజులలో డీలక్స్ కాటే జీలకు రూ.3,360, ఏసీ స్టాండెడ్ కాటేజీలకు రూ.2,500, న్యూస్టాండెడ్ కాటేజీలకు రూ.2,800,నాన్ ఏసీ రూమ్ లకు రూ.1680 చొప్పున తీసుకుంటారు. మిగిలిన కొన్నికాటేజీలను ఆధునీకరిస్తున్నారు.



బీచ్ రిసార్ట్స్‌లోని బార్ అండ్ రెస్టారెంట్



బీచ్ రిసార్ట్స్ లోని ఏసీ డైనింగ్ హాలు

బీచ్ రిసార్ట్స్‌లో సౌకర్యాలు

పర్యాటకులకు కావాల్సిన అన్నిరకాల సదుపాయాలు కల్పించేందుకు రిసార్ట్స్‌ను ఆధునీకరించారు. అందుబాటులో బార్ అండ్ రెస్టారెంట్ ఉంది. ఫ్యామిలీతో భోజనాలు చేసేందుకు ప్రత్యేకంగా ఏసీ డైనింగ్‌హాలు ఏర్పాటు చేశారు. వనభోజనాలు చేసేందుకు కాటేజీలకు ఎదురుగా ఆహ్లాదకరంగా చెట్లు పెంచారు. కాటేజీల బయట కూర్చుని సముద్ర తీరాన్ని వీక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు.

ఆర్డర్ ఇస్తే వనభోజనాలు ఏర్పాటు చేస్తాం

బీచ్ రిసార్ట్స్ మేనేజర్ జీ అశోక్



కార్తీకమాసంలో సూర్యలంక సముద్రతీరానికి వచ్చే భక్తులు ఆర్డర్ ఇస్తే వనభోజనాలు ఏర్పాటు చేస్తాం. కాటేజీలలో ఉండేవారికి బ్రేక్‌ఫాస్ట్ ఇస్తాం. ఇద్దరు పెద్దలు, ఇద్దరు పిల్లలు ఉండవచ్చు. అదనంగా ఉంటే ఒక్కొక్కరికి రూ.560 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. క్యాండిల్ లైటు డిన్నర్, క్యాంప్ ఫైర్ అవకాశం కూడా కల్పిస్తాం. హైక్వాలిటీ ఆల్కాహాలు అందుబాటులో ఉంటుంది.

అర్బన్ ఎస్ఐ గా శివరామకృష్ణ బాధ్యతల స్వీకారం

చిలకలూరిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట అర్బన్ ఎస్ఐగా టి.శివరామకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అర్బన్ పోలీస్ స్టేషన్‌లో అర్బన్ సీఐ పి.రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం ఆయన నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. కాగా అర్బన్ ఎస్ఐ లుగా ఇప్పటికే చెన్నకేశవులు, రహంతుల్లా లు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శివరామకృష్ణ మూడవ ఎస్ఐగా వచ్చారు.

విద్యుత్ లైన్‌మన్, జేఎల్ఎంపై డీఈకి ఫిర్యాదు

వినుకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): లంచం ఇవ్వందే విద్యుత్‌శాఖ సిబ్బంది పనులు చేయడంలేదని నాగులవరం గ్రామస్థులు నరసరావుపేట విద్యుత్‌శాఖ డీఈకి ఫిర్యాదు చేసిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఏనుగుపాలెం, పిట్టంబండ, నాగులవరం గ్రామాల్లో పనిచేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, ప్రతి పనికి రేటు కట్టి వసూలు చేస్తూ రైతులను, విద్యుత్ వినియోగదారులను ఇబ్బందులు పెడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై వినుకొండ విద్యుత్‌శాఖ ఏడీఈ టి.శ్రీనివాసరావును వివరణ కోరగా గతంలో గ్రామాల్లో విజిలెన్స్, ఏపీటీఎస్ అధికారులు తనిఖీల్లో విద్యుత్‌ను అక్రమంగా వాడుతున్నట్లు కేసులు నమోదు చేయడంతో, ఉద్దేశపూర్వకంగానే ఫిర్యాదు చేసినట్లు స్థానిక సిబ్బంది లైన్‌మన్ సురేష్, జేఎల్ఎం శ్రీనివాసరావులు చెబుతున్నారన్నారు. సోమవారం డీఈ ఆదేశాల మేరకు విచారణ చేపడతామని తెలిపారు.

ఇస్సపాలెం ఆర్యవైశ్య సత్రంలో అన్నదానం

నరసరావుపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం ఇస్సపాలెం ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేపీ రంగారావు, మద్ది రామబ్రహ్మానందం, చేగు వెంకటేశ్వరరావు, బత్తుల మురళి, అడ్డగిరి ద్వారక వాసు, మిట్టపల్లి శేఖర్, బత్తుల విష్ణు, భవిరిశెట్టి నాగేశ్వరరావు, అన్నే చంద్రమోహన్, ఇస్సపాలెం వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ వైద్య శిబిరంలో 148 మందికి పరీక్షలు

చిలకలూరిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నరసరావుపేట రోడ్ లోని రోటరీ భవన్‌లో ఉచిత గుండె వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాదులోని కాంటినెంటల్ హాస్పిటల్ వారి సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 148 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు రూ.లక్ష విలువగల మందులు ఉచితంగా అందచేశారు. స్థానిక శ్రీప్రసన్నలక్ష్మి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు శిబిరంలో సేవలందించారు. శిబిరాన్ని డాక్టర్ మెరుగుమాల వంశీ ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఉపాధ్యక్షుడు ఆలేటి ప్రసాద్, కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాదు, ముత్తినేని వెంకటేశ్వర్లు, తేలప్రోలు వీరయ్యచౌదరి, కందిమళ్ళ అంజిబాబు, హరిదాసుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడికి పొట్టి శ్రీరాములు విశిష్ట సేవా రత్న అవార్డు

నరసరావుపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు పొట్టి శ్రీరాములు విశిష్ట సేవారత్న అవార్డు అందుకున్నారు. తాడేపల్లిగూడెంలో ఆదివారం గమిని ఫంక్షన్ ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు అభ్యుదయ వేదిక సిరిమువ్వ సోషల్ సర్వీస్ అండ్ ఆర్ట్ అసోసియేషన్ వారు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ మాట్లాడుతూ అత్తులూరి సుబ్బారావు కరోనా సమయంలో కొవిడ్‌ను లెక్కచేయకుండా వేల కుటుంబాలకు నిత్యాసరాలు అందించారన్నారు. పేద విద్యార్థులకు ఆర్థికసాయం, 50కుటుంబాలకు వైద్య ఖర్చుల కోసం సాయం చేశారన్నారు. కార్యక్రమంలో సిరిమువ్వ వ్యవస్థాపకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

వినుకొండ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరి పంటలు సాగు చేస్తున్న రైతులకు పంటలకు చీడపీడ ఆశించినప్పుడు రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయశాఖ అధికారి అంజిరెడ్డి ఆదివారం పలు సూచనలు చేశారు. పంటలో కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు, ఉల్లి కోడు, నల్లి, తదితర తెగుళ్ళ ఉధృతిని తగ్గించాలంటే తగినవిధంగా పంటలపై మందులు పిచికారి చేయాలని సూచించారు.

నాడు - నేడు నిధులు దుర్వినియోగం

● మరుగు దొడ్లున్నా మరలా నిర్మాణం

రొంపిచర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం మరుగు దొడ్లు నిర్మించింది. ఈ పథకం కింద 45పాఠశాలలు ఎంపికయ్యాయి. గతంలో మరుగుదొడ్లు ఉన్నా మరలా నిర్మించటంతో నిధులు దుర్వినియోగం అయ్యాయి. పది రకాలుగా పాఠశాలకు వసతుల కోసం నిధులు వెచ్చించాల్సి ఉంది. ఫేజ్-1,2 దశల్లో నాడు-నేడు పనులకు పాఠశాలలు ఎంపికయ్యాయి. పలు చోట్ల నిధులు మంజూరు కాకపోవటంతో మరుగు దొడ్లకు రంగులు కూడా వేయలేదు. గతంలో ఉన్న వాటిని అలాగే వదిలివేశారు. ఉన్న వాటిని వినియోగించకుండా కొత్తవి నిర్మించటం వల్ల నిధులు వృథాగా మారాయని పలువురు విమర్శిస్తున్నారు. ఆ నిధులను పాఠశాలలో మరోక సౌకర్యానికి వినియోగిస్తే బాగుండేదంటున్నారు.

యథేచ్ఛగా గంజాయి విక్రయాలు

● మూలాలను అరికట్టడంలో అధికారులు విఫలం

● మత్తుకు బానిసై పక్కదారి పడుతున్న యువత

● యాచకుల సాయంతో గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు



గంజాయి తాగుతున్న యాచకులు

వినుకొండ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినుకొండ గంజాయికి అడ్డాగా మారింది. దమ్ము కొట్టందే యువతకు నిద్రపట్టని పరిస్థితి. బహిరంగ ప్రదేశాల్లో యథేచ్ఛగా గంజాయి తాగుతున్నప్పటికీ ఎక్సైజ్, పోలీస్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రధానంగా యువత గంజాయికి బానిసై పలు అకృత్యాలకు తెగబడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. గంజాయి వాసనలు గుప్పు గుప్పుమంటున్నా పోలీస్ అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గంజాయి తాగిన వ్యక్తులను, వారి ఆగడాలను భరించలేక పోలీసులే స్వయంగా వారి ఇండ్ల వద్ద వదిలిపెట్టిన దాఖలాలు ఉన్నాయి. వినుకొండ పట్టణానికి సమీపంలోని చెక్కవాగు, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, కారంపూడి రోడ్డు, ఎన్ఎస్‌పీ కాలువ రైల్వే బిడ్జి, ముండ్లమూరు బస్టాండ్, అంబేడ్కర్ కాలనీ మారుమూల ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం. వైసీపీ పాలనలో గంజాయి విక్రయాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగగా, ఆనెట్‌వర్క్ బలంగా వేళ్లూకుని ఇంకా కొనసాగుతున్నాయి. ఇటీవల అధికారులను కన్నుగప్పి యాచకులుచే విక్రయాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల గంజాయి విక్రయాలపై నిఘాపెట్టి పక్కదారి పడుతున్న యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గంజాయి విక్రయాలను అరికట్టాలను ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిలిచిన మురుగు

ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు



ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న మురుగుకుంట, మండల వనరుల కేంద్రం చుట్టూ చేరిన మురుగు

ఈపూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ మురుగునీరు చేరడంతో కార్యాలయాలకు వచ్చే వారు అధికారులు అవస్థలు పడుచున్నారు. ఈపూరు మండల వనరుల కేంద్రం చుట్టూ నీరు చేరి చిన్న సైజు తటాకాలను తలపిస్తున్నాయి. ఆ దారిలో సచివాలయంకు, ఎమ్మార్వోకి వెళ్ళాలంటే నీటిలో దిగాల్సిందే. అంతేకాకుండా చుట్టూ పిచ్చిచెట్లు అల్లుకు పోతుండడంతో విషసర్పాలు కార్యాలయంలో చొరబడుతున్నాయని అక్కడ పనిచేసే సిబ్బంది భయాందోళనకు గురవుచున్నారు. ఎంపీడీవో కార్యాలయం చుట్టూ ఆక్రమణలు జరగడంతో మురుగునీరు వెళ్ళే దారిలేక అక్కడ నిలిచిపోయారు. ఆ మురుగు కుంట నుంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో కార్యాలయాలకు పనుల మీద వచ్చేవారు ఇబ్బంది పడుచున్నారు. అధికారులు స్పందించి నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు కోరుచున్నారు.

ఆపదలో ఉన్న పేదలకు వరం సీఎం సహాయ నిధి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో అత్యవసరంగా వైద్య అవసరాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు కొండంత అండగా నిలుస్తుందని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం తన నివాసంలో అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి మెరుగైన వైద్యం అందించేందుకు ముందస్తుగా పత్రాలు పంపిణీ చేశారు. పట్టణంలోని 33వ వార్డుకు చెందిన సారంగి ప్రభు కిరణ్‌కు రూ.10 లక్షలు, గణేషునివారిపాలెంకు చెందిన రామస్వామికి రూ.1,08,600, దార్ల దీప్తికి రూ.2 లక్షలు మంజూరు పత్రాలను ప్రత్తిపాటి వారికి అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వైద్యశాలలో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులను ఆదుకొనేందుకు చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్నామని ప్రత్తిపాటి తెలిపారు.

వైసీపీ నేతలు కళ్ళ గంతలు విప్పి చూడాలి

నాదెండ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు వారి కళ్ళకు కట్టుకున్న నీలి గంతలు విప్పి చూస్తే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కన్పిస్తాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని తూబాడు, జంగాలపల్లి గ్రామాల్లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భూమిపూజ చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్‌తో పాటు సజ్జల రామకృష్ణారెడ్డిలు వారికి అలవాటైన తప్పుడు ప్రచారాలతో నెట్టుకు రావాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో రూ.4,500కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నా వారి కంటికి అభివృద్ధి కన్పించకపోవటం విడ్డూరంగా ఉందని వివరించారు. వచ్చే సంక్రాంతి నాటికి గ్రామాల్లో అంతర్గత రోడ్లు, ఇతర రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చటం వంటి కార్యక్రమాలను చేయటం ద్వారా రూపు రేఖలు మార్చాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు పని చేస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా మదర్సా అభివృద్ధికి అంచనాలు తయారు చేయించాలని నాయకులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ తలతోటి రాణి, జనసేన, టీడీపీ నాయకులు తోట రాజా రమేష్, బీ సత్యనారాయణ, దగ్గుమల్లి సాంబశివరావు, చెన్నుపాటి నాగేశ్వరరావు, గోపు చిన్నపరెడ్డి, డీ వెంకటేశ్వర్లు, షేక్ ఖాజావలి, షేక్ యాసిన్, గాదె ఇన్నారెడ్డి, చాంద్ బాషా, రాయపరెడ్డి, పోతురాజు, బాలస్వామి, అంకమ్మ, లక్ష్మయ్య, శౌరిరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాటిని కలసిన జీజీహెచ్ సూపరింటెండెంట్

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి నూతన సూపరింటెండెంట్‌గా నియమితులైన చిలకలూరిపేట పట్టణానికి చెందిన డాక్టర్ రమణ ఎస్ఎస్‌వీ బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆదివారం మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం డాక్టర్ రమణ ఎస్ఎస్‌వీ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను నిరుపేదలకు ఉపయోగపడేలా మరీ ముఖ్యంగా పేట పరిసర ప్రాంత ప్రజలు అందరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్య సహాయ సహకారాలు అందజేసేలా చూస్తానన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా శాలువాతో అభినందించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు కంచర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ



బాలోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, డీఈవో ఎల్.చంద్రకళ తదితరులు

నరసరావుపేట టౌన్, నరసరావుపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు బాలోత్సవం 2024 పిల్లల పండుగ డిసెంబరు 13, 14 తేదీలలో పట్టణంలోని పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాలలో జరుగుతుందని కమిటీ అధ్యక్షుడు రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ బ్రోచర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, డీఈవో ఎల్ చంద్రకళ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవాధ్యక్షుడు ఎంఎస్‌కేఆర్ ప్రసాదు మాట్లాడుతూ ఈ ఏడాది బాలోత్సవాలలో పదివేలమంది విద్యార్థులు హాజరవుతారని భావిస్తున్నామన్నారు. మొత్తం 65విభాగాలలో జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు అన్నారు. శాస్త్రీయ నృత్యాలు, లఘునాటికలు, కోలాటాలు, బుర్రకథలు, మట్టి బొమ్మల తయారీ అంశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఈ పండుగలో విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు, పల్నాడు జిల్లా జీసీడీవో డి.రేవతి, బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు ఆక్స్‌ఫర్డ్ రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు ఎమ్మెస్ఆర్కే ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు సెల్వరాజ్ తదతరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ బొల్లు కృష్ణారావు, సభ్యులు

ప్రతిభ గల పేద విద్యార్థినికి ఆర్థికసాయం

నరసరావుపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎన్‌జీవో కాలనీలో ఉన్న బొల్లు రాజేశ్వరికృష్ణారావు ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ప్రతిభ గల పేద విద్యార్థినికి రూ.20వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. సేవా కార్యక్రమంలో భాగంగా పత్తిపాడు మండలం యనమదలకు చెందిన గుంటూరు నాగమణికి ఈ ఆర్థికసాయం అందజేశారు. గుంటూరు నాగమణి ఆర్‌వీఆర్ జేసీ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, సినీ నటుడు బొల్లు వెంకటకృష్ణారావు మాట్లాడుతూ తాను ఆర్థికసాయం చేసేవారు లేక ఎక్కువ చదువుకోలేదన్నారు. పేద, ప్రతిభ కలిగిన విద్యార్థులకు మరింత సాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ బొల్లు వెంకటేశ్వర్లు, సభ్యులు మర్లపాటి రామకృష్ణ, మలినేని శ్రీనివాసరావు, మలినేని శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు

మధ్యంతర భృతిని ప్రకటించాలి

● ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మధ్యంతర భృతి 35శాతం వెంటనే ప్రకటించి, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా ఎస్టీయూ ద్వితీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ జడ్పీపీఎఫ్, ఏపీజీఎల్ఐ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తామని చెప్పిన హామీ మేరకు వెంటనే 117 జీవోను రద్దుచేసి, 3, 4, 5 తరగతుల విలీనాన్ని ఆపి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎల్వీ రామిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని తదితరులు మాట్లాడారు. పట్టణంలోని నేత్ర వైద్యుడు డాక్టర్ రామలింగారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎస్టీయూ కార్యవర్గ సభ్యులకు, ఉపాధ్యాయులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతిశ్రీ మాట్లాడుతూ నేత్ర సంబంధి జాగ్రత్తలు, మెలకువలు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె గంగాధర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి యు చంద్రజిత్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌కే కరిముల్లా, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఈ ఏమండి, రాష్ట్ర మహిళా కన్వీనర్ సుశీల, పోటు శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శులు షేక్ మహబూబ్ సుభాని, కే రామలింగయ్య, అక్కయ్య ఆంజనేయులు, ఎస్ రాఘవయ్య, టీ రాజశేఖర్, ఏషియా, శరత్, సిలార్‌మహమ్మద్, సురేష్, రామయ్య, ఆంజనేయులు, తదతరులు పాల్గొన్నారు.

వెల్లటూరులో మెగా వైద్యశిబిరం

బొల్లాపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు జడ్పీ హైస్కూల్లో నరసరావుపేట తేజా నర్సింగ్ హోమ్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ బొట్ల రఘుప్రసాదు, డాక్టర్ పార్వతి, డాక్టర్ రవితేజ, డాక్టర్ కర్నాటి శ్రావణి వైద్యశిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్యసేవలు అందజేశారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్ళు, నరాల వ్యాధులకు శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. షుగర్, బీపీ, సీబీపీ, కీళ్ళ నొప్పులకు సంబంధించి తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సుమారు మూడు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముత్తినేని వెంకటేశ్వర్లు, హాస్పిటల్ సిబ్బంది, గ్రామస్తులు పెంటాల వెంకటేశ్వర్లు, వక్కలగడ్డ బాబూరావు, బొడ్డపాటి శరత్ చంద్రయ్య, రామకృష్ణ, బేతపూడి వెంకటేశ్వర్లు, అర్దలపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బొట్ల రఘుప్రసాదు, సిబ్బంది

రైతులకు అందుబాటులో రసాయనిక ఎరువులు

● ఎంఏవో ఎస్‌కే సుగుణాబేగం



నూజెండ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల అవసరాల మేరకు ఎంఆర్‌పీ రేట్లకే రసాయనిక ఎరువులు అందిస్తున్నట్లు మండల వ్యవ సాయఅధికారి ఎస్‌కే సుగుణాబేగం తెలిపారు. ఆమె ఆంధ్రజ్యోతికి వెల్లడించిన పలు అంశాలు...



ప్రశ్న: మండలంలో రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

జవాబు: మండలంలోని నూజెండ్ల, గుర్రప్పనాయుడువారిపాలెం పీఏసీఎస్‌లు, నూజెండ్లలో జీడీసీఎంఎస్, మండలంలోని 15 రైతుసేవా కేంద్రాల్లో, గ్రామాల్లోని డీలర్ల వద్ద యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు రైతులకు విక్రయిస్తున్నారు.

ప్ర: యంత్ర పరికరాలు ఎప్పటినుంచి రైతులకు అందుబాటులోకి వస్తాయి?

జ: రైతులకు రాయితీపై యంత్ర పరికరాలను అందజేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను సిద్ధం చేస్తుందని, ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందిన వెంటనే వ్యవసాయ పరికరాలు అందజేస్తాం.

ప్ర: ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం ఎంత?

జ: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి 1605ఎకరాలు, మిరప 1046 ఎకరాలు, పొగాకు 897 ఎకరాలు, కంది 2135 ఎకరాలు, ఆముదం, పెసర, మినుము తదితర పైర్లతో కలిపి 6,934 ఎకరాలు సాగు చేశారు.

ప్ర: సోషల్ ఆడిట్ ఎలా జరిగింది?

జ: మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో 2282 మంది రైతులు ఈ క్రాపు నమోదు చేయించుకున్న పంటలను ప్రత్యేక బృందాలు సోషల్ ఆడిట్ చేశాం. కొన్ని గ్రామాల్లోని రైతులు అధిక వర్షాలతో వేసిన పైర్లు దెబ్బతినటం, సాగర్ జలాలు విడుదల కావటంతో పంట మార్పిడి చేసినట్లు గుర్తించాం.

ప్ర: మండలంలో పంపిణీ చేసిన విత్తనాల వివరాలు?

జ: మండలంలోని రైతులకు ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను పచ్చిరొట్ట పైర్లుగా వినియోగించుకొనేందుకు 150 క్వింటాళ్లు పంపిణీ చేశాం. అదేవిధంగా 150 క్వింటాళ్ల వరి విత్తనాలను రైతులకు రాయితీపై అందజేశాం.



ఊడిజర్లలో వరి పైర్లను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● మోసం చేసిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

● రైతు సంఘం నాయకుడు రాము

ఈపూరు. నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నకిలీ వరి విత్తనాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు ఉలవలపూడి రాము అన్నారు. మండలంలోని ఊడిజర్ల, యర్రబాలెం గ్రామాల్లో నకిలీ వరి విత్తనాలు వేసి సాగు చేసిన పైర్లను ఆదివారం రైతు సంఘం నాయకులు పరిశీలించారు. గత ఏడాది సాగునీరు లేకపోవడం వల్ల పంటలు పండించలేకపోయిన అన్నదాతలు ఈ ఏడాది సాగర్ కాలువలకు నీరు రావడంతో పంటలు సాగు చేశారు. అయితే ముందుగా సాగుచేసిన వరి పంటకు కేళీలు రావడంతో కౌలు రైతులు రూ.20వేల నుంచి రూ.40వేల వరకు నష్టం వస్తుందన్నారు. అనుమతులు ఉన్నాయనే ధైర్యంతో విత్తనాలు విక్రయించారన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకొని వారితో రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని రైతు సంఘం నాయకులు కోరారు. రైతులు సాయిరెడ్డి, రామిరెడ్డి, ఏడుకొండలు రెడ్డి, ఈదయ్య, కాశిరెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రభంజన్ కుమార్ సింగ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

ఏఎన్‌యూ ఫెన్సింగ్ జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక

నరసరావుపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఫెన్సింగ్ జట్టుకు నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి బీ ప్రభంజన్ కుమార్‌సింగ్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. చదువుతో పాటు క్రీడలలో ప్రావీణ్యం గుర్తించి అత్యుత్తమైన నైపుణ్యాన్ని పొందేలా కృషిచేసి ఉన్నత స్థానానికి తీసుకెళ్లడమే కళాశాల లక్ష్యం అన్నారు. ఈ నెల 6 నుంచి 11 వరకు జమ్ము యూనివర్శిటీలో జరగబోయే అఖిభారత అంతర విశ్వవిద్యాలయ ఫెన్సింగ్ పోటీలలో బీ ప్రభంజన్ కుమార్ సింగ్ పాల్గొంటారని పీడీ ఈదర ఆదిబాబు తెలిపారు. ఈ సందర్భంగా బీ ప్రభంజన్ కమార్‌సింగ్‌ను కళాశాల డైరెక్టర్ కే నాసరయ్య, అధ్యాపకులు అభినందించారు.



వైద్యశిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కంటి వైద్యశిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరివారిపాలెంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ప్రజా కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర కంటి ఆసుపత్రి, అల్లూరివారిపాలెం గ్రామ యువజన మిత్రబృందం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో సుమారు 250మంది రోగులకు కంటి పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ బిపిన్, డాక్టర్ స్వాతిలు పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించారు. కాగా శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని పెదకాకానిలోని శంకర ఆసుపత్రికి ప్రత్యేక బస్సులో పంపినట్లు వారు చెప్పారు. కార్యక్రమాన్ని ఉడత రాజేష్, గోనుగుంట్ల కోటేశ్వరరావు వారి మిత్రబృందం నిర్వహించారు.

మండల వనరుల కేంద్ర భవనంలో ఎవరికి వారే

● పాఠశాలల వైపు కన్నెత్తి చూడని సీఆర్పీలు

రొంపిచర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల వైపు సీఆర్‌పీలు కన్నెత్తి కూడా చూడటం లేదని విమర్శలు వినవస్తున్నాయి. ప్రభుత్వ పథకాలకు సంబంధించి యాప్‌లు, పాఠశాలల్లో వసతులు పరిశీలించటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రొంపిచర్ల, అలవాల, విప్పర్లపల్లి, సంతగుడిపాడు, రెడ్డిపాలెం కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఒక్కొక్క కాంప్లెక్స్‌కు ఒక సీఆర్‌పీని ప్రభుత్వం నియమించింది. ఐతే పలువురు సీఆర్‌పీలు మండల వనరుల కేంద్ర భవనం వైపు కన్నెత్తి కూడా చూడరు. తమకు తోచినవిధంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఉపాధ్యాయులు చెపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించటం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నా, పలువురు సిబ్బంది వల్ల పాఠశాలల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను వారు పరిశీలించాల్సి ఉంది. తమకు తోచినప్పుడు ఏదో ఒక పాఠశాలకు వెళ్తుంటారు. ఇటువంటి ఘటనలపై సంబంధిత విద్యాశాఖ అధికారులు పరిశీలన చేయాల్సి ఉంది. మండల వనరుల కేంద్ర భవనం కూడా అధ్వాన స్థితికి చేరింది. దీన్ని కూడా విద్యా శాఖ అధికారులు పరిశీలించాల్సి ఉంది.